# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

28.01.2026 బుధవారం Wednesday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 200 | పేజీలు : 11 Pages : 11 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana

## రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789



## ముగ్గురు మంత్రుల భేటీ
# డిప్యూటీ సీఎం క్లారిటీ

ఇదేక్కడి విచిత్రం.. డిప్యూటీ సీఎంతో మాట్లాడకూడదా?

- కావాలనే సోషల్ మీడియాలో దుష్ప్రచారం
- పార్టీలో చీలికలు తెచ్చేందుకు తప్పుడు రాతలు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

2

## టీవీ ఛానెల్ డిబేట్‌లో
# అవమానం



- గుత్తాకు ఫిర్యాదు చేసిన తక్కళ్లపల్లి

2




# ముని్సపోల్ నగారా

- ఫిబ్రవరి 11న పోలింగ్... 12 అవసరమైతే రీపోలింగ్
- ఫిబ్రవరి 13న కౌంటింగ్ .. అదేరోజు ఫలితం వెల్లడి
- 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎంపిక
- నేటి నుంచే నామినేషన్ల స్వీకరణ.. 30 వరకు గడువు
- 31న నామినేషన్ల పరిశీలన.. ఫిబ్రవరి 3 వరకు ఉపసంహరణ
- వెంటనే అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- షెడ్యూల్ ప్రకటించిన కమిషనర్ రాణి కుముదిని



తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి 2026 సాధారణ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారికంగా విడుదల చేశారు. ఫిబ్రవరి 11న పోలింగం నిర్వహిస్తారు. రీ పోలింగ్ అవసరమైన చోట్ల 12న జరుపుతారు.

4

## నేటి నుంచే
# మహాజాతర



మేడారంలో మొదలైన జాతర సందడి

- పగిడిద్దరాజు, జంపన్నలను చేర్చే ఘట్టం ప్రారంభం
- రేపు గద్దెనెక్కనున్న సమ్మక్క
- జనసంద్రంగా మేడారం పరిసరాలు
- జాతర నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు

> ప్రపంచంలోనే రెండో అతిపెద్దదిగా ప్రసిద్ధిగాంచిన ఆదివాసీ కోయ గిరిజన మేడారం మహాజాతరకు సర్వం సిద్ధమైంది. నేటి నుంచి శనివారం వరకు నాలుగు రోజులపాటు ఆదివాసీ కోయగిరిజన సమాజం తమ ఇలవేల్పులైన సమ్మక్క-సారలమ్మకు మొక్కులు చెల్లించేందుకు మేడారం పయనం అవుతున్నది. బుధవారం సాయంత్రం సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు మేడారం గద్దెల ప్రాంగణంలో ప్రతిష్ఠించడంతో మహాజాతర ప్రారంభానికి అంకురార్పణ జరుగుతుంది.

**ములుగు, జనవరి 27 :** రెండేళ్లకోమారు జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఏర్పాట్లు చేసింది. బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు జాతర సాగనుంది. అమ్మవార్లను గద్దెలకు తీసుకుని రావడం మొదలు.. మళల్ఈ అడవికి తరలించే వరకు జాతర సాగుతుంది. ఈ మహా ఘట్టాన్ని సమర్థంగా.. భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సన్నద్ధమయ్యాయి. ఈసారి సౌకర్యాల కల్పనతోపాటు నిర్మాణ పనులనూ ఏకకాలం చేపట్టారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఒకవైపు వనదేవతల గద్దెల పునర్నిర్మాణ పనులు సాగుతున్న సమయంలోనే లక్షలాది మంది ముందస్తుగా అమ్మలను దర్శించుకున్నారు. ప్రధాన జాతర తేదీల్లో భక్తుల రద్దీ కారణంగా గద్దెల ప్రాంగణం వద్ద అమ్మల దర్శనం ఆషామాషీ విషయం కాదు. ఈసారి గ్దదెల పునర్నిర్మాణం నేపథ్యంలో ప్రాకారం విస్తరించారు.

మిగతా 2 లో



## ప్రజలకు అత్యుత్తమ
# సేవలే లక్ష్యం

- భారత్-ఐరోపా సమాఖ్య మధ్య స్వేచ్ఛావాణిజ్యం
- ఒప్పందం కుదిరిందన్న ప్రధాని నరేంద్రమోదీ
- వాణిజ్య ఒప్పందంతో తగ్గనున్న స్కాచ్, కార్ల ధరలు

4

భారత్-ఐరోపా సమాఖ్య మధ్య స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కుదిరినట్లు ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. భారత్-ఈయూ మధ్య ఎఫ్‌టీఏ కుదిరింది. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు దీనిని మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు.



# బడ్జెట్ పద్దులకు తుది మెరుగులు

నార్త్ బ్లాక్‌లో హల్వా వేడుకలు

పాల్గొన్న ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

4

## దోచుకుంటున్న
# కార్పొరేట్ స్కూళ్లు

నేనే విద్యాశాఖ మంత్రినైతే.. వాటిని మూయించేస్తా

విద్య వ్యాపారం కావద్దు

మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు



వివరాలు 3లో



## సింగరేణి స్కామ్‌పై దర్యాప్తు
# జరిపించండి

గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన కేటీఆర్ బృందం

3

# అత్యుత్తమ సేవలే లక్ష్యం

- రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు
- కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- పఠాన్‌చెరువులో ఇంటిగ్రేటెడ్ భవనానికి నేడు శంకుస్థాపన
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

2





మొదటి దయ్యం
# అతనే

- అతనే గుంపు మేస్త్రీ గూఢఛారి
- కేసీఆర్ ఎన్ని ఇడ్లీ తిన్నాడన్నది చేరవేసే ఏజెంట్
- సంతోష్ రావుపై మండిపడ్డ కవిత

3

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI

కరీంనగర్ | బుధవారం 28 జనవరి 2026



# మేడారం జాతర శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్

**హైదరాబాద్, జనవరి 27:** మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు వెళ్లేవారికి, రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. భక్తులు అమ్మవార్ల దర్శనంతో కృపకు పాత్రులై, ఆధ్యాత్మిక శాంతిని పొందాలని సీఎం ఆకాంక్షించారు. దర్శనానంతరం ప్రతి ఒక్కరూ క్షేమంగా తమ తమ ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. మేడారం జాతరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయని సీఎం తెలిపారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని స్పష్టం చేశారు. జాతర ఏర్పాట్లపై ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావుకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. భక్తుల భద్రత, సౌకర్యాలు అత్యంత ప్రాధాన్యంగా ఉండాలని, ఎక్కడా లోటుపాట్లు లేకుండా పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

# ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్, కేటీఆర్



**హైదరాబాద్, జనవరి 27:** మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభం సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ త్యాగానికి, ధిక్కారానికి ఆదివాసీ దేవతలు సమ్మక్క సారలమ్మలు ప్రతీకలని కేసీఆర్ అన్నారు. కొంగు బంగారమై, కోరిన కోరికలు తీర్చే తమ ఇలవేల్పులకు మొక్కులు తీర్చుకునేందుకు కోట్లాదిగా తరలివచ్చే భక్తులతో మేడారం జాతర కుంభమేళాను తలపిస్తూ ఆధ్యాత్మిక కేంద్రమై కొనసాగుతుందన్నారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సమాజాల సబ్బండ కులాల సంస్కృతి సాంప్రదాయాలకు పదేళ్ల బీఆర్ఎస్ పాలన పెద్దపీట వేసిందని కేసీఆర్ పేర్కొన్నారు. గోదావరిలోయ పరివాహక ప్రగతితో సమాంతరంగా సాగిన ఆధ్యాత్మిక అభివృద్ధిని ఈ సందర్భంగా కేసీఆర్ స్మరించుకున్నారు. అన్ని రంగాల్లో ప్రగతి తిరిగి పుంజుకొని, తెలంగాణ ప్రజలు సుభిక్షంగా జీవించేలా దీవించాలని సమ్మక్క సారలమ్మ దేవతలను కేసీఆర్ ప్రార్థించారు. అలాగే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భక్తులందరికీ మేడారం జాతర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. 'వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను కొలుస్తూ భక్తులు ప్రతీ రెండేళ్లకొకసారి ఎంతో వైభవోపేతంగా జరుపుకునే అతిపెద్ద ఉత్సవం మన మేడారం జాతర' అని ఆ పోస్టులో పేర్కొన్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే జాతర ఈ జాతర అని కొనియాడారు. సమ్మక్క సారలమ్మల పోరాట స్ఫూర్తికి, త్యాగనిరతికి ప్రతీక ఈ సమ్మక్క సారలమ్మ మహా జాతర అని తెలియజేశారు. తెలంగాణతోపాటు దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షల సంఖ్యలో భక్తులు హాజరయ్యే 'తెలంగాణ కుంభమేళా' మేడారం జాతర అని కేటీఆర్ అభివర్ణించారు. సమ్మక్క, సారలమ్మ తల్లుల దీవెనలు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# టీవీ ఛానెల్ డిబేట్‌లో అవమానం

**గుత్తాకు ఫిర్యాదు చేసిన తక్కళ్లపల్లి**



**హైదరాబాద్, జనవరి 27:** టీవీ ఛానెల్ డిబేట్‌లో తనకు జరిగిన అవమానంపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. శాసనమండలి ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అయిన సిరికొండ మధుసూధనాచారి నేతృత్వంలో.. ఇవాళ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఛైర్మన్ కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ తన ఫిర్యాదును ఛైర్మన్‌కు అందజేశారు. ఏబీఎన్ డిబేట్‌లో తనకు జరిగిన అవమానంపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు. ఇటీవల ఏబీఎన్‌లో జరిగిన ఓ డిబేట్ సందర్భంగా రవీందర్ రావును గెట్‌అవుట్ అంటూ అవమానించారు. దీనిపై ఆయన ఫిర్యాదు చేశారు. తక్కళ్లపల్లి రవీందర్ రావుతోపాటు వెళ్లి మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నేతల్లో దేశపతి శ్రీనివాస్, మండలి డిప్యూటీ ఎ÷–లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఎల్ రమణ, నవీన్‌రెడ్డి ఉన్నారు.

# మోగిన తెలంగాణ మున్సిపల్ నగారా

**ఫిబ్రవరి 11న పోలింగ్...12 అవసరమైతే రీపోలింగ్**

**ఫిబ్రవరి 13న కౌంటింగ్ ..అదేరోజు ఫలితం వెల్లడి**

**16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎంపిక**

**నేటినుంచే నామినేషన్ల స్వీకరణ.. 30 వరకు గడువు**

**31న నామినేషన్ల పరిశీలన.. ఫిబ్రవరి 3 వరకు ఉపసంహరణ**

**వెంటనే అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్**

**షెడ్యూల్ ప్రకటించిన కమిషనర్ రాణి కుముదిని**



**హైదరాబాద్, జనవరి 27:** మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి 2026 సాధారణ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని విడుదల చేశారు. ఫిబ్రవరి 11న పోలింగం నిర్వహిస్తారు. రీ పోలింగ్ అవసరమైన చోట్ల 12న జరుపుతారు. వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, నేటినుంచే నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది. ఈ ఎన్నికల పక్రియ ద్వారా మొత్తం 52 లక్షల 43 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కమిషనర్ ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28వ తేదీ బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను జనవరి 30వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు దాఖలు చేయవచ్చు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన చేపట్టి, అదే రోజు సాయంత్రం అర్హత పొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అనంతరం తుది బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్ఈసీ రాణికుముదిని ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. షెడ్యూల్ మేరకు 28 నుంచి నామినేషన్ల పక్రియ ప్రారంభంఅవుఉతంది. 30తో నామినేషన్ల స్వీకరణ గడవు ముగియనున్నది. 31న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హత పొందిన వారి జాబితా ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3.. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు కాగ,ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహిస్తారు. రీపోలింగ్ ఎక్కడైనా ఉంటే ఫిబ్రవరి 12న నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితం ప్రకటిస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరుగుతుంది. ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక చేపడతారు. మున్సిపల్ ఎన్నికల్లో 53 లక్షల మందికి పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు.

# నేటి నుంచే మేడారం జాతర

మొదటి పేజీ తరువాయి

రూ.100 కోట్లతో చేపట్టిన ఈ పనులు ఈసారి జాతరకే వన్నె తీసుకొచ్చాయి. విస్తరణ నేపథ్యంలో ఏకకాలంలో 9–10 వేల మంది దర్శించుకొనే వెసులుబాటు ఉంటుందని చెబుతున్నారు. వనదేవతలు సమ్మక్క–సారలమ్మ మహాజాతర ఒక ఘట్టం మంగళవారం ప్రారంభం కానున్నది. ఊరట్టం పంచాయతీ కన్నెపల్లి గ్రామం నుంచి పోలెబోయిన వంశీయులు మేడారంలోని జంపన్నవాగు ఒడ్డున ఉన్న గద్దెపై రాత్రి 7 గంటలకు జంపన్నను తీసుకురానున్నారు. జంపన్నను ఆదివాసీల్లోని నాలుగో గొట్టుకు చెందిన పోలెబోయిన వంశీయులు దశాబ్దాలుగా కొలుస్తున్నారు. గతంలో ఇంటివద్దనే పూజలు చేసుకునేవారు. 2022 నుంచి జంపన్నను గద్దెకు తీసుకువస్తున్నారు. గతంలో జంపన్నను తీసుకువచ్చిన పోలెబోయిన సత్యం గతేడాది అనారోగ్యంతో మరణించడంతో ఈసారి అతడి సోదరుడు శ్రీను ఆ బాధ్యతలు తీసుకున్నారు. మేడారం మహాజాతర బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో కొలువైన పెనుక వంశీయుల ఇలవేల్పు, సమ్మక్క భర్త పగిడిద్దరాజును మేడారానికి తీసుకెళ్తారు. మహాజాతర పగిడిద్దరాజు చేరికతో ప్రారంభమవుతుంది. మంగళవారం తెల్లవారుజాము నుంచే గ్రామంలో పెనుక వంశీయులు పగిడిద్దరాజు ఆలయాన్ని శుద్ధి చేసి ముగ్గులు వేసి మామిడి తోరణాలతో అలంకరిస్తారు. గ్రామంలోని పెనుక వెంటేశ్వర్లు ఇంట్లో పగిడిద్దరాజుకు ఆదివాసీ సంప్రదాయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడి నుంచి పాన్పును ఊరేగింపుగా గ్రామంలోని ఆలయానికి తీసుకెళ్తారు. అనంతరం పడగ రూపంలో పగిడిద్దరాజును పెళ్లికొడుకుగా ముస్తాబు చేసి ఊరేగింపుగా మేడారానికి బయల్దేరుతారు. అటవీ మార్గంలో కాలినడకన వెళ్తూ మంగళవారం రాత్రి లక్ష్మీపురంలో బస చేస్తారు. బుధవారం ఉదయం మళ్లీ మొదలై మధ్యాహ్నం వరకు మేడారం



చేరుకుంటారు. గద్దెపై పగిడిద్దరాజును ప్రతిష్ఠించడంతో మహాజాతర మొదటి ఘట్టం మొదలవుతుంది.

# ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యం

**రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు**

**కార్పొరేట్ స్థాయిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు**

**పఠాన్‌చెరువులో ఇంటిగ్రేటెడ్ భవనానికి నేడు శంకుస్థాపన**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**



**హైదరాబాద్, జనవరి 27:** తెలంగాణ ప్రజలకు వేగవంతంగా పారదర్శకంగా అత్యుత్తమ సేవలు అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత పదేళ్లలో ఆనాటి పాలకుల స్వార్థపూరిత నిర్ణయాల వల్ల రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందని విమర్శించారు. గడచిన రెండేళ్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాలు, సూచనల మేరకు భ్రష్టుపట్టిన వ్యవస్థను సంస్కరిస్తూ రెవెన్యూ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల ఏర్పాటుపై మంగళవారం నాడు సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ .. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్‌లుగా విభజించి ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థికభారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని నిర్మాణంతో పాటు ఐదు సంవత్సరాల నిర్వహాణాబాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని తెలిపారు. మూడు నుంచి ఐదు ఎకరాల స్థలంలో కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని వివాహ రిజిస్ట్రేషన్ల కోసం మినీ మ్యారేజీ హాల్, గర్భిణీలకు, వృద్దులకు ప్రత్యేక వసతులు, విశాలమైన వెయిటింగ్ ఏరియా మహిళల కోసం ఫీడింగ్ రూమ్, చిన్నపిల్లల కోసం క్రెచ్, వృద్దులు, దివ్యాంగుల కోసం ఆధునిక లిఫ్ట్ సౌకర్యం తదితరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మిగిలిన కార్యాలయాలకు శంకుస్థాపనలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రెండవ విడతలో జిల్లా కేంద్రాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మిస్తామని ఇందుకు అవసరమైన కార్యాచరణను సిద్దం చేయాలని సూచించారు. ఇప్పటికే తాలిమ్‌లో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని జూన్ 2వ తేదీ నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల మేడ్చల్ జిల్లాలో భవనానికి శంకుస్థాపన చేయడం జరిగిందని పఠాన్ చెరువు–శంకరపల్లి ప్రధాన రహదారి సమీపంలో రాజపుష్ప కనస్ట్రక్షన్ నిర్మించే ఇంటిగ్రేటెడ్ భవనానికి బుధవారం నాడు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, ఈ ఆధార్ సంతకం వంటి సౌకర్యాలతో ప్రజల సమయాన్ని ఎంతో ఆదా చేశామని అన్నారు. రెవెన్యూ శాఖలో తీసుకుంటున్న ఈ సంస్కరణలు కేవలం కార్యాలయాల మార్పు మాత్రమే కాకుండా, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే సంస్కరణలుగా నిలుస్తాయని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# ముగ్గురు మంత్రుల భేటీ.. డిప్యూటీ సీఎం క్లారిటీ

**ఇదేక్కడి విచిత్రం.. డిప్యూటీ సీఎంతో మాట్లాడకూడదా?**

**కావాలనే సోషల్ మీడియాలో దుష్ప్రచారం**

**పార్టీలో చీలికలు తెచ్చేందుకు తప్పుడు రాతలు**

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, జనవరి 27:** ప్రజాభవన్‌లో సోమవారం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో ముగ్గురు మంత్రుల భేటీ.. తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్నప్పుడు జరిగిన ఈ భేటీ ఆసక్తికరంగా మారింది. లోక్‌భవన్‌లో గవర్నర్ నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ నేరుగా ప్రజాభవన్‌కు వెళ్లారు. అనంతరం కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం, మంత్రులు పలు అంశాలపై కీలక చర్చ నిర్వహించారు. అయితే.. సీఎం విదేశీ పర్యటనలో ఉన్నప్పుడు .. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ముగ్గురు మంత్రుల భేటీపై పలు ఊహాగానాలు మొదలయ్యాయి.. ఈ నేపథ్యంలో మంత్రులతో భేటీపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. మంగళవారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం కేంద్రమైన మధిర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికలు రానున్న క్రమంలో మంత్రులతో సమావేశమైనట్లు ఎన్నికల నిర్వహణ బాధ్యతలపై చర్చించినట్లు చెప్పారు. కరీంనగర్ మంత్రులతోనే సమావేశం కావడం పై ఆయన విశ్లేషణ ఇచ్చారు. మంత్రులు భేటీ కావడం సాధారణ విషయమని.. అనవసరమైన రాద్ధాంతం అవసరం లేదంటూ పేర్కొంటున్నారు. అయితే మంత్రులు తనతో భేటీ కావడం సాధారణ విషయమని స్పష్టం చేశారు భట్టి విక్రమార్క. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందుబాటులో లేరు కాబట్టే.. మంత్రులు తనతో పలు అంశాలపై చర్చించారని చెప్పారు. తనతో పాటు సీఎం, మంత్రులంతా సమష్టిగా పని చేస్తున్నామని భట్టి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అందుబాటులో లేరు కాబట్టి పాలన విషయం పై మంత్రులతో చర్చించకూడదా ? ఇది ఎక్కడ విచిత్రం కొన్ని పత్రికలు సోషల్ మీడియాలో కావాలనే కాంగ్రెస్ పార్టీలో చీలికలు తేవాలని తప్పుడు రాతలు రాస్తూ దుష్ప్రచారం చేస్తున్నారు. వారి పప్పులు ఇక్కడ ఉడకవన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి సమస్య పై మంత్రులు శ్రీధర్ బాబు ఉత్తమ్ కుమార్ రెడ్డి అడ్లూరి లక్ష్మణ్ తో భేటీ అయినట్లు తెలిపారు. కొన్ని పత్రికలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని ముఖ్యమంత్రి లేకుండా డిప్యూటీ సీఎంతో మంత్రులు సమావేశం కావడం పై ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ మాపై బురద జల్లాలని చూస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధిక మెజార్టీతో పట్టం కట్టారన్నారు. ప్రజలు మమ్మల్ని అభిమానిస్తున్నారు ఆదరిస్తున్నారు



ఆశీర్వదిస్తున్నారు రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజారిటీతో గెలుపొంది విజయఢంకా మోగిస్తామన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని అభివృద్ధి అనే పదం ప్రజలు వినలేదు చూడలేదని ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలు చేరాయి. నగరాల్లో పట్టణాల్లో పాలనకు సంబంధించిన సంస్కరణలను తీసుకొచ్చామని కోర్ ప్యూర్ రేర్ అనే స్టేటస్టిక్స్ రాష్ట్రంలోనే అన్ని జిల్లాలను సమానంగా అభివృద్ధి పరిచే విధంగా ముందుకు పోతున్నామని తెలిపారు.

# నేను చెబుతున్న మొదటి దయ్యం అతనే

- అతనే గుంపు మేస్త్రీ రేవంత్‌కు గూఢచారి
- కేసీఆర్ ఎన్ని ఇడ్లీ తిన్నాడన్నది చేరవేసే ఏజెంట్
- మాజీ ఎంపీ సంతోష్ రావుపై మండిపడ్డ కవిత

**హైదరాబాద్, జనవరి 27:** తాను చెప్పిన మొదటి దయ్యం సంతోష్ రావేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఉద్యమకారులకు ఉద్యమ నాయకుడిని దూరం చేసింది అతనేనని కవిత ఘాటుగా విమర్శించారు. గద్దర్ లాంటి నాయకులు గేటు బయట ఉండాల్సి వచ్చిందంటే దానికి కారణం ఆయనేనని ఆరోపించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన కామెంట్స్ చేశారు. సంతోష్ రావుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 'కేసీఆర్ దగ్గర ఉన్న మొదటి దెయ్యం సంతోష్ రావు' అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డికి ప్రధాన గూఢాచారి కూడా సంతోష్ రావేనని ఆరోపించారు. ఫాంహౌస్‌లో కేసీఆర్ ఫుల్ ఇడ్లీ తిన్నారా? సగం ఇడ్లీ తిన్నారా? అనే సమాచారాన్ని రేవంత్‌కు సంతోష్ చేరవేస్తాడని వ్యంగ్యాస్త్రాలు సంధించారు కవిత. బీఆర్ఎస్‌లో ఎందరో నేతలతో కన్నీళ్లు పెట్టించిన దుర్మార్గుడు సంతోష్ అని మండిపడ్డారు. ప్రగతి భవన్ గేటు బయట గద్దర్‌ను నిలబెట్టింది, ఈటల బీఆర్ఎస్ సస్పెండ్‌కు కారణం సంతోష్ రావే అని కవిత ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్‌ను ఉద్యమకారులకు, పేద ప్రజలకు దూరం చేశారని మండిపడ్డారు. అలాంటి వ్యక్తికి అనుకూలంగా కేటీఆర్, హరీశ్ రావులు ట్వీట్లు పెట్టడాన్ని బీఆర్ఎస్ క్యాడర్ గమనించుకోవాలని కవిత సూచించారు. బీఆర్ఎస్‌లో అన్ని దుర్మార్గాలకు కారణం సంతోష్ రావేనని ఆరోపించారు. ఎం రేవంత్‌రెడ్డికి సంతోష్‌రావు గూఢచారి. నేను ముందునుంచి చెబుతున్న దెయ్యం ఆయనే. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ సంతోష్‌కు ఎలాంటి శిక్ష విధిస్తుందనేది వేచి చూడాలి. ఆయనకు శిక్ష పడుతుందన్న నమ్మకం నాకు లేదని కవిత వ్యాఖ్యానించారు.



గుంపు మేస్త్రీ రేవంత్ తన గూఢాచారిని ఫోన్ ట్యాపింగ్ కేసులో కాపాడుకుంటాడని.. సిట్ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎక్సైజ్ పోలీసులంటే గంజాయి సరఫరాదారులు, స్మగ్లర్లకు భయం లేదని కవిత అన్నారు. ఎక్సైజ్ పోలీసులు, అటవీశాఖ సిబ్బంది వద్ద ఆయుధాలు ఉంటేనే భయం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో గృహ హింస పెరిగిపోతోందన్నారు.

# దోచుకుంటున్న కార్పొరేట్ స్కూళ్లు

- నేను విద్యామంత్రి అయితే వాటిని మూయించేస్తా
- విద్య వ్యాపారం కావద్దు
- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**నల్లగొండ, జనవరి 27:** కార్పొరేట్ స్కూళ్లలో అధిక ఫీజులతో ప్రజలను దోచుకుంటున్నారని.. తాను విద్యాశాఖ మంత్రి అయితే అలాంటి స్కూళ్లను మూసివేయిస్తానని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. విద్య వ్యాపారం కావద్దని తేల్చిచెప్పారు. మంగళవారం నల్గగొండ టౌన్‌లోని బొట్టుగూడలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన ప్రభుత్వ పాఠశాలను ఆయన ప్రారంభించారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడుతూ.. 'నల్లగొండ ప్రజల రుణం తీర్చుకోవడానికే నల్లగొండ మున్సిపాలిటీని కార్పొరేషన్ చేశా. కేంద్రం నుండి నిధులు తెచ్చి నల్లగొండ రూపు రేఖలు మారుస్తానని అన్నారు. నేను ప్రధాని నరేంద్ర మోదీని కలిస్తే వెయ్యి, 2 వేల కోట్ల రూపాయల నిధులైనా ఇస్తారు. విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుంది. నాకు ఉత్సాహం ఉంటే ఎన్నికల్లో మళ్లీ పోటీ చేస్తా. లేకుంటే ప్రతీక్ స్కూల్‌లో విద్యార్థులను చదివిస్తూ జీవితం గడుపుతానన్నారు. ఈ స్కూల్ విద్యార్థులను ఆణిముత్యాల్లా తీర్చిదిద్ది ఐఏఎస్, ఐపీఎస్‌లుగా తయారు చేయాలి. నిజాయితీగా బతికా.. పేద వారికి సహాయం చేశా. చదువంటే ర్యాంకులు మాత్రమే కాదని ఓ ఆలోచన చేశాం. విద్యకు ప్రాధాన్యత ఇచ్చి యంగ్



ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నాం. బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలలో పూర్తిగా డిజిటల్ విద్యను అందిస్తాం' అని అన్నారు. సరైన విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని వెంకట్‌రెడ్డి అన్నారు. విద్యకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. బొట్టుగూడలో అత్యాధునిక వసతులతో ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాలను ఆయన ప్రారంభించారు. రూ.8కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ పాఠశాలలో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడినా తొలి పదేళ్లలో మన సమస్యలు తీరలేదని మంత్రి అన్నారు. ప్రతి నియోజకవర్గంలో దాదాపు రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని.. కులమతాలకు అతీతంగా విద్యార్థులు చదువుకోవాలన్నది తమ ప్రభుత్వ ఆశయమని చెప్పారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను సర్కారు పాఠశాలల్లో చదివించి మార్పు తీసుకురావాలని ఈ సందర్భంగా కోమటిరెడ్డి సూచించారు. తాను విద్యాశాఖ మంత్రిని అయితే కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు బంద్ చేయడం ఖాయమన్నారు. విద్య వ్యాపారం కాదన్న ఆయన... కార్పొరేట్ విద్యా సంస్థలు పేదలను దోచుకుంటున్నాయని ఆరోపించారు. అత్యాధునిక డిజిటల్ క్లాస్ రూమ్ లు, లైబ్రరీ, ఆడిటోరియం, ఇండోర్ స్టేడియం లతో 8 కోట్ల నిర్మాణ వ్యయంతో 3 అంతస్తుల్లో ఈ స్కూల్ ను నిర్మించారు. ప్రతీక్ ఫౌండేషన్ నిర్మించిన ప్రభుత్వ స్కూల్ ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఆరోగ్యం సహకరిస్తే వచ్చే ఎన్నికల్లో నల్లగొండ నుండే పోటీచేస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున నాణ్యమైన విద్య అందించాలని నిర్ణయం తీసుకుందన్నారు. అభివృద్ధి కోసం తాను ఏది అడిగినా సీఎం కాదనరని చెప్పారు. నల్లగొండ మున్సిపాలిటీనీ అభివృద్ధి చేసేందుకే కార్పొరేషన్ గా మార్చామని అన్నారు. కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి నల్లగొండ కార్పొరేషన్ ను అభివృద్ధి చేస్తానని చెప్పారు. నల్లగొండ పట్టణంలో మరో ఆరు నెలల్లో 24 గంటలు తాగు నీరు అందిస్తానని చెప్పారు. కొడంగల్ కు ఎన్ని నిధులు ఇస్తే తన నియోజకవర్గానికి అన్ని నిధులు ఇవ్వాలని సీఎంను కోరినట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

# సింగరేణి బొగ్గు స్కామ్‌పై దర్యాప్తు జరిపించండి

## గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన కేటీఆర్ బృందం

**హైదరాబాద్, జనవరి 27:** సింగరేణిలో బొగ్గు స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు జరిపించేలా చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్రసమితి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్ట నేతలు లోక్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం బీఆర్ఆర్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సింగరేణిలో దోపిడీ అంశంపై గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చాం. ఆధారాలతో బయటపెట్టినప్పటి నుంచి కాంగ్రెస్‌లో వణుకు మొదలైంది. కుంభకోణాన్ని బట్టబయలు చేశాక పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రజల దృష్టి మళ్లించేందుకే ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ పేరిట ఒక్కొక్కరిని పిలుస్తున్నారు. సీఎం అంటే కోల్ మాఫియా నాయకుడిగా సింగరేణి కార్మికులు భావిస్తున్నారు. ఫుట్‌బాల్ ఆటకు రూ.10కోట్ల సింగరేణి నిధులు దుర్వినియోగం చేశారు. స్కామ్‌ల విషయంలో పాలకుల నుంచి స్పష్టమైన జవాబు లేదు. ఓబీ టెండర్లలో సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనతో పారదర్శకతకు



పాతరేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సింగరేణి టెండర్లలో నిబంధనలు పెట్టారు. నిబంధన పెట్టిన 9 నెలల్లో ఎందరు కాంట్రాక్టర్లు సందర్శించారు. సింగరేణి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి. రింగ్ మాస్టర్ సృజన్‌రెడ్డి.. సీఎం బావమరిదేనా? కాదా? స్పష్టత ఇవ్వాలి. కాంట్రాక్టర్లను రింగ్ చేసి ప్రజాధనం దోపిడీకి యత్నిస్తున్నారు. ప్రభుత్వం రూ.వేల కోట్లు కొల్లగొడుతోందని సింగరేణి కార్మికులు గుర్తించాలి. సింగరేణి కుంభకోణాన్ని అడ్డుకోవాలని గర్నవర్‌ను కోరాం' అని కేటీఆర్ తెలిపారు.

# రిజిస్ట్రేషన్ కార్యాలయం తరలింపు కుదరదు

## మంత్రులతో మాట్లాడే వరకు నిర్ణయం తీసుకోవద్దు

## అధికారులను హెచ్చరించిన కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి

**సంగారెడ్డి, జనవరి 27:** సంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మరో చోటికి తరలిస్తే ఊరుకోనని కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా, పట్టణ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను మరో చోటికి తరలిస్తే ఊరుకునేది లేదని అన్నారు. ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పేరుతో పటాన్‌చెరులోని కర్ధనూర్‌కు తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారని.. దీన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో తాను మాట్లాడేవరకు తరలింపు ఆలోచన చేయొద్దన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు ఇది తన సూచన.. హెచ్చరిక అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. సంగారెడ్డిలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల తరలింపు విషయంపై జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఆ శాఖ అధికారులపై ఆయన మండిపడ్డారు. అక్కడి డిస్టిక్ట్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని 'ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం' పేరుతో పఠాన్‌చెరు నియోజకవర్గం కర్ధనూర్‌కు తరలించాలని నిర్ణయించినట్లు సమాచారం. దీనిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తీవ్రంగా వ్యతిరేకించారు. అవసరమైతే అక్కడ ఉన్న పఠాన్‌చెరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పఠాన్‌చెరుకు తీసుకెళ్లవచ్చని సూచించారు. జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో మాట్లాడే వరకు ఎలాంటి తరలింపు ఆలోచన చేయవద్దన్నారు. ఇది కేవలం సూచన కాదు.. హెచ్చరికగా పరిగణించాలి' అని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.





# సిట్ విచారణకు సంతోష్ రావు

**హైదరాబాద్, జనవరి 27:** బీఆర్ఎస్ పార్టీ కీలక నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌రావు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో సిట్ అధికారులు ఆయనను విచారిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలంటూ సిట్ సోమవారం ఆయనకు నోటీసులు ఇచ్చింది. దాంతో ఇవాళ సంతోష్‌రావు సిట్ అధికారుల ఎదుట విచారణకు వచ్చారు. సోమవారం సిట్ నోటీసులు అందుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను రేపు సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరవుతానని, కేసు సంబంధించి వారు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెబుతానని అన్నారు. కాగా ఇదే కేసులో గతంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లను కూడా సిట్ విచారించింది. వారి వాంగ్మూలాలను నమోదు చేసింది.

# జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత

## మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన జర్నలిస్టు సంఘాలు

**హైదరాబాద్, జనవరి 27:** రాష్ట్రంలో పాత్రికేయుల సంక్షేమం, భద్రత, వృత్తి గౌరవాన్ని కాపాడేవిధంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పాత్రికేయుల అక్రిడిటేషన్ అంశంపై అన్ని పాత్రికేయ సంఘాల సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకుని గతంలో విడుదల చేసిన జీవోలో మార్పులు చేర్పులు చేసి కొత్త జీవోను జారీ చేశామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని అన్నారు. మంగళవారం నాడు సచివాలయంలో పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు మంత్రిగారి కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రభుత్వం ఎలాంటి భేషజాలకు పోకుండా అందరికి న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు.

# లంచం తీసుకుంటూ పట్టుబడ్డ హౌసింగ్ ఏఈ

**ఆదిలాబాద్, జనవరి 27:** లంచం తీసుకుంటూ ఔట్ సోర్సింగ్ ఏఈ శ్రీకాంత్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే..ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని హౌసింగ్ శాఖలో ఔట్ సోర్సింగ్ ఏఈగా పనిచేస్తున్న శ్రీకాంత్ రూ.10,000 లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుపడ్డారు. నార్నూర్‌లోని ఇందిరమ్మ ఇంటికి సంబంధించిన ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్డేట్ చేయడానికి ఏఈ శ్రీకాంత్ లబ్దిదారుల వద్ద నుంచి రూపాయలు 20,000 డిమాండ్ చేశాడు. దీంతో లబ్దిదారులు ఏసీబీని ఆశ్రయించారు. వారి సూచన మేరకు పదివేల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకొని లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితున్ని ఏసీబీ కరీంనగర్ కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

# వరంగల్‌లో రోడ్డు ప్రమాదం

## టూ వీలర్‌ను వేగంగా ఢీకొన్న టిప్పర్

## ప్రమాదంలో నిండు గర్భిణిగా ఉన్న డాక్టర్ మృతి

**వరంగల్, జనవరి 27:** వరంగల్ నగరంలో విషాద ఘటన చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో నిండు గర్భిణిగా ఉన్న వైద్యురాలు మృతిచెందారు. మట్టెవాడ ఎస్సై శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని గుల్బర్గా జిల్లా చించోలి మండలం బత్తంపల్లికి చెందిన ఎస్.మమతారాణి వైద్యురాలిగా పనిచేస్తున్నారు. నగరంలోని హంటర్‌రోడ్డులోని ఫాదర్ కొలంబో ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. గతేడాది నారాయణపేట జిల్లాకు చెందిన డాక్టర్ రాఘవేంద్రతో ఆమెకు వివాహం జరిగింది. సోమవారం రాత్రి విధులు ముగించుకొని భర్తతో కలిసి హంటర్ రోడ్డు మీదుగా బైక్‌పై ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యలో ఏడు మోరీల కూడలి వద్దకు రాగానే వెనక నుంచి వచ్చిన టిప్పర్ వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలు కింద పడిపోయారు. 9 నెలల గర్భిణిగా ఉన్న మమతా రాణి తీవ్రంగా గాయపడటంతో స్థానికుల సహాయంతో భర్త నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందారు. టిప్పర్ డ్రైవర్ అన్సారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని ఝార్ఖండ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఎంత కొట్లాడినా తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాదు

## టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్




**హైదరాబాద్, జనవరి 27:** బీజేపీ ఎంత కొట్లాడినా తెలంగాణలో అధికారంలోకి రాదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కర్ణాటక, తెలంగాణలో బీజేపీ లేదన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న పీసీసీ చీఫ్ మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీతో పాటు బీఆర్ఎస్ పని కూడా అయిపోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్మాణంపై స్పందిస్తూ ఇంకా 2 డీసీసీ ప్రెసిడెంట్లు, మహిళా అధ్యక్షురాలి ఎంపిక పెండింగ్‌లో తెలిపారు. కేటీఆర్ సోషల్ మీడియాను పట్టుకుని పాకులాడుతున్నారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్‌లో బీఆర్ఎస్ లేదన్నారు. ఇక్కడ కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉందన్నారు. కవిత సొంత పార్టీ పెట్టి పోటీ చేసే ఆలోచనలో ఉన్నదన్నారు. నైనీ కోల్ బ్లాక్ పంచాయతీ మీడియా సృష్టేనని కొట్టిపారేశారు. ఈ అంశంపై కేసీ వేణుగోపాల్ వద్ద ఎలాంటి చర్చ జరగలేదన్నారు.



సంపాదకీయం

# మేడారం.. ఓ మహా జనజాతర!

తెలంగాణలో జాతరలకు ప్రత్యేక స్థానం ఉంది. చిన్నాచితకా జాతర్లను ప్రతీ గ్రామంలోనూ..ఆయా ప్రాంతాల్లోనూ చూస్తుంటాం. జాతరలో అనేక రకాల దేవతలను స్మరించుకుంటుంటారు. ఒక్కో జాతర ఒక్కో లక్ష్యంగా సాగుతుంది. స్థానిక దేవతులకు మొక్కులు చెల్లించుకునే జాతరలు ఈ ప్రాంతంలో కోకొల్లు. కొమురవెల్లి, కొత్తకొండ.. కొండపోచమ్మ...ఇలా అనేక జాతరలు ప్రసిద్ధి చెందాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా అనేక జాతరలు సాగుతుంటాయి. అయితే ఇవన్నీ ఒక ఎత్తయితే..మేడారం జాతర మరో ఎత్తు. కేవలం గిరిజన సంప్రదాయాలకే పరిమతమైన ఈ జాతర ఇప్పుడు సర్వజనావళి ఆమోదంగా మారింది. ఇక్కడి సమ్మక్క-సారలమ్మకు మొక్కులు చెల్లించుకోవడం కోసం గిరిజనేతులరే ఎక్కువగా వస్తున్నారు. గద్దెలను దర్శించుకోవడం, బంగారం సమర్పించుకోవడం..మొక్కులు చెల్లించుకోవడం వంటివన్నీ గిరిజన సంప్రదాయంలో సాగినా...అందరినీ ఆకట్టుకునే, ఆకర్శించే జారతగా మేడారం మారింది. అలాగే జాతర నాలుగు రోజులు కోట్ల రూపాయల వ్యాపారం కూడా సాగుతుంది. సామాన్య వ్యాపారులకు ఇక్కడ బతుకు సాగుతుంది. మొత్తంగా మేడారం... జనజాతరకు రంగం సిద్దం అయ్యింది. రెండేళ్ల కోమారు జరిగే జాతర కోసం ప్రజలు కళ్లల్లో వత్తులు వేసుకుని చూస్తుంటారు. అమ్మవార్లను దర్శించుకోవడం ఆయనవాయితీగా పెట్టుకున్నవారికి మేడారం జాతర ఓ మహాపండగ. కుటుంబాలతో కలసి అమ్మవారి గద్దెలను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకోవడం..తృప్తిగా ఇంటికి రావడంతో మనసు పులకించి పోతుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓ మారుమూల గ్రామం మేడారం ఇవాళ ప్రపంచ వ్యాప్తంగా తలెత్తుకుని చూసేలా సిద్దం అయ్యింది. నిజానికి మేడారం పేరులోనే ఒక మహత్తు ఉందేమో అనిపిస్తుంది. ఎందుకంటే ఈ పేరు చెప్పగానే గిరిజనులు సహా, ఇక్కడికి వచ్చే భక్తులు పులకించి పోతారు. కొత్త చైతన్యం కానవస్తుంది. అమ్మవారిని దర్శించుకోగానే సరికొత్త జీవితంలోకి అడుగు పెడుతుంటారు. అంతా అమ్మదయ అన్న ధీమాతో జీవనాయనం సాగిస్తుంటారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ జాతర నిర్వహణ జిల్లా పాలనా యంత్రాంగానికి ఒక పెద్ద సవాల్ లాంటిదే. అయితే వారు కూడా అలవోకగా ఈ జారతను నిర్వహిస్తుంటారు. అందుకు అమ్మదయ కూడా కారణం కావచ్చు. దాదాపు కోటి మందికి పైగా గిరిజనులు, గిరిజనేతరులు హాజరయ్యే ఈ జాతర గిరిజన సంస్కృతీ, సాంప్రదాయాలను ఇప్పటికీ పాటిస్తూ ప్రత్యేకంగా నిలిచింది. ఒక అటవీ కుగ్రామంలో మౌలిక సదుపాయాలు అంతంతమాత్రంగానే ఉన్న ప్రాంతంలో జరిగే ఈ జాతరను గిరిజన కుంభమేళాగా అభివర్ణిస్తారు. ఈ జాతరకు హాజరయ్యే భక్తజన కోటి ఏయేటికాయేడు పెరుగుతందే తప్ప తగ్గడం లేదు. కేవలం ఆ తల్లుల దర్శనం చేసుకుంటే చాలు తమ కష్టాలు మాయం అవుతాయన్న భరోసాతో భక్తులు వస్తుంటారు.అందుకే ఏటేటా భక్తుల రాక పెరుగుతోంది. ఎంతోమంది ఎడ్ల బండ్లలో మేడారానికి వచ్చి కనీసం మూడు రోజులు బస చేస్తారు. ఇక్కడే వంటావార్పు చేసుకుని తమ జీవితం ధన్యమయ్యిందని భావిస్తారు. మతాలు, దేశాలు, పద్ధతులు వేరైనా సరే జాతరలు సహజంగా జరిగేవే. కానీ, ఏ జాతరకూ లేని ప్రత్యేకతలు, ఏ జాతరలోనూ కనిపించని విశిష్టతలు మేడారంలో కనిపిస్తాయి. గలగల పారే సంపంగివాగులో పుణ్యస్నానాలు చేసే కుంభమేళా లాంటి దృశ్యాలు ఇక్కడా కనిపిస్తాయి. గణగణ మోగే గంటలు హిందూ దేవాలయాల వాతావరణాన్ని ప్రతిధ్వనిస్తాయి. కొండకోనల మధ్య జనసందోహం శబరిమలను తలపిస్తుంది. తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించే మరో తిరుమల ప్రత్యక్ష మవుతుంది. ఈ జాతర కేవలం కోయల సంప్రదాయాలను గౌరవించడం, గుర్తించడం వరకు మాత్రమే పరిమితం కాదు. నమ్మిన జనం కోసం ప్రాణమైనా ఇవ్వాలనే ఓ సందేశం కూడా అంతర్లీనంగా ఉంటుంది. యుద్ధంలో గెలిచిన కాకతీయులు సామ్రాజ్యాన్ని విస్తరించుకుని చక్రవర్తులయ్యారు. పోరాటం చేసిన మేడరాజులు మాత్రం దేవుళ్లు అయ్యారు. అయితే ఇక్కడికి వచ్చే వారెవ్వరూ గత చరిత్రలోకి వెళ్లరు. అమమవార్లపై ఉన్న నమ్మకంతో మొక్కులు చెల్లించుకుంటారు. మళ్లీమళ్లీ వస్తామని మొక్కుకుంటారు. మేడారం మహా జాతరకు అందుకే భక్తులు పోటెత్తుతారు. సమ్మక్క, సారలమ్మ దర్శనం కోసం లక్షలాదిగా తరలివస్తుంటారు. వరాలిచ్చే దేవతలుగా వెలుగొందుతున్న తల్లులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జాతర పరిసరాలు కిక్కిరిసిపోయిన, దర్శనం అవుతుందా కాదా అన్న సందేహం లేకుండా ముందుకు సాగుతుంటారు. మేడారం-పస్రా, మేడారం-తాడ్వాయి రహదారుల వెంట చెట్లకింద భక్తులు విడిది చేయడం ఆనవాయితీ. ప్రకృతి ఒడిలో వంటలు చేసుకొని విందుభోజనాలు చేస్తూ ఇళ్లకు తిరుగు ప్రయాణమవుతుంటారు. గుడిలో దేవుడు..పూజారి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పొర్లు దండాలు వంటివన్నీ ఏవీ లేని ఈ జాతర తెలంగాణ జాతరల్లో ప్రత్యేకంగా నిలిచిపోతుంది. కోటానుకోట్ల మందికి ఆర్థ్య దైవంగా సమ్మకక్క-సారలమల్మ జాతర నాలుగు రోజులు రంజుగా సాగనుంది.



# ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యం

- భారత్-ఐరోపా సమాఖ్య మధ్య స్వేచ్ఛావాణిజ్యం
- ఒప్పందం కుదిరిందన్న ప్రధాని
- వాణిజ్య ఒప్పందంతో తగ్గనున్న స్కాచ్, కార్ల ధరలు



**న్యూఢిల్లీ, జనవరి 27:** భారత్-ఐరోపా సమాఖ్య మధ్య స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కుదిరినట్లు ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. భారత్-ఈయూ మధ్య ఎఫ్‌టీఏ కుదిరింది. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు దీనిని మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు. మంగళవారం గోవాలో ఇండియా ఎనర్జీ వీక్- 2026ను వర్చువల్‌గా ప్రారంభించిన సందర్భంగా ట్రేడ్ డీల్ గురించి మాట్లాడారు. ఈ ఒప్పందంతో భారత్, ఐరోపా ప్రజలకు అద్భుతమైన అవకాశాలను అందిస్తుంది. ప్రపంచంలోనే పెద్ద ఆర్థికవ్యవస్థల మధ్య సమన్వయానికి నిదర్శనం. ప్రపంచ జీడీపీలో ఇండియా, ఈయూ ఉమ్మడి వాటా 25శాతం. ప్రపంచవాణిజ్యంలో ఇది మూడోవంతుకు సమానం. ఈ డీల్ ఇరువర్గాల మధ్య వాణిజ్యాన్ని పెంపొదించడమే గాకుండా.. ప్రజాస్వామ్యం, చట్టబద్ధపాలనపై మన నిబద్ధతను బలోపేతం చేస్తుందని మోదీ వెల్లడించారు. ఈ ప్రకటన అనంతరం హైదరాబాద్ హౌస్‌లో మోదీ, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయన్ సమావేశమయ్యారు. వారు ఇండియా-ఈయూ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. ఇక ఈ ఎనర్జీ వీక్‌లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 150 దేశాలకు చెందిన ప్రతినిధులు గోవాకు వచ్చారు. మీరంతా ఇంధన భద్రత, సుస్థిర భవిష్యత్తు గురించి మాట్లాడేందుకు భారత్‌కు వచ్చారు. మా వద్ద భారీ రిఫైనింగ్ సామర్థ్యాలు ఉన్నాయి. ఈ విషయంలో మేం ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నాం. త్వరలో నంబర్‌వన్ స్థానానికి చేరుకుంటాం అని వెల్లడించారు. భారత్- యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పూర్తయింది. 18 సంవత్సరాల నిరీక్షణ తర్వాత భారతదేశం, యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడం వైన్, విస్కీ ప్రియులు, లగ్జరీ కార్ల అభిమానులకు ఆనందాన్ని ఇస్తోంది. ఈ ట్రేడ్ డీల్ ద్వారా భారతీయ వస్తువులకు యూరోపియన్ మార్కెట్ల తలుపులు తెరుచుకుంటాయి. యూరప్ నుంచి దిగుమతి అయిన వస్తువులు భారతదేశంలో చౌకగా లభిస్తాయి. ఈ ఒప్పందాన్ని 'అన్ని వాణిజ్య ఒప్పందాలకు తల్లి' అని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ అభివర్ణించారు. ప్రస్తుతం యూకే నుంచి భారత్‌కు దిగుమతి అవుతున్న స్కాచ్ విస్కీ, జిన్‌పై 150 శాతం సుంకాలను విధిస్తున్నారు. తాజా ఒప్పందం నేపథ్యంలో ఆ సుంకాలు 20 శాతానికి తగ్గుతాయి. అయితే దీనిని వెంటనే కాకుండా 5-10 సంవత్సరాల కాల వ్యవధిలో అమలు చేస్తారు. దీంతో యూరప్‌నకు చెందిన ప్రీమియం జిన్‌లు, వైన్, వోడ్కాలు చౌకగా లభిస్తాయి. అలాగే భారతీయ మద్యానికి కూడా ఈయూ సభ్య దేశాలలో పన్ను మినహాయింపులు లభిస్తాయి. మెర్సిడెస్, బీఎమ్‌డబ్ల్యూ, ఆడి వంటి యూరోపియన్ కార్లకు ప్రస్తుతం 100 శాతం పన్నులు విధిస్తున్నారు. ఒప్పందం తర్వాత ఆ పన్నులు నిర్ణయించిన కాల వ్యవధిలో పది శాతానికి తగ్గుతాయి. అయితే రూ. 25 లక్షల కంటే తక్కువ ధరకు అమ్ముడుపోయే అవకాశం ఉన్న కార్లను మాత్రం భారత్‌కు ఈయూ ఎగుమతి చేయదు. భారత ఆటోమొబైల్ పరిశ్రమను రక్షించడానికి ఈ నిబంధన పెట్టారు. యూరప్ నుంచి దిగుమతి అయ్యే కేన్సర్, ఇతర తీవ్రమైన అనారోగ్యాల చికిత్సలో ఉపయోగించే మందుల ధరలు కూడా తగ్గుతాయి. అలాగే యూరప్ నుంచి భారత్ దిగుమతి చేసుకునే వైద్య పరికరాల ధరలు కూడా తగ్గుతాయి.యూరప్ నుంచి దిగుమతి చేసుకునే విమానాల విడి భాగాలు, మొబైల్ ఫోన్లు, హైటెక్ ఎలక్ట్రానిక్ వస్తువులపై సుంకాలు తగ్గుతాయి. ఇది భారతదేశంలో గా÷-జడెట్ల తయారీ ఖర్చులను తగ్గిస్తుంది. తుది వినియోగదారునికి ప్రయోజనం చేకూరుస్తుంది. ముఖ్యంగా మొబైల్ ఫోన్లు చౌకగా లభించవచ్చు.ఇనుము, ఉక్కు, రసాయన ఉత్పత్తులపై సున్నా సుంకాల ప్రతిపాదన ఉంది. దీని వలన నిర్మాణ, పారిశ్రామిక రంగాలలో ముడి పదార్థాల ధరలు తగ్గుతాయి. అలాగే చాక్లెట్లు, సౌందర్య సాధనాలు, పలు గృహోపకరణాలు కూడా గతంలో కంటే చౌకగా లభిస్తాయి. ఇక, భారత్‌లో తయారయ్యే వస్త్రాలు, పాదరక్షలు, ఆటో భాగాలు, రత్నాలు, ఆభరణాలు, ఫర్నిచర్, క్రీడా వస్తువులు, రసాయనాలు, యంత్ర పరికరాలపై ఈయూ పన్నుల నుంచి మినహాయింపు లభిస్తుంది. ఈ మేరకు భారతీయ వస్త్ర, ఫుట్‌వేర్, ఆటో మొబైల్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తుల సంస్థలు భారీగా లాభపడనున్నాయి.

# పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

**అఖిలపక్షం నిర్వహించిన కేంద్రం**

**వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు**



**న్యూఢిల్లీ, జనవరి 27:** బడ్జెట్ సమావేశాల్లో అన్ని విషయాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అఖిలపక్ష భేటీలో కేంద్రం స్పష్టం చేసింది. అయితే చర్చకు అను-సరించాల్సిన తీరులో ముందుకు రావాలని కూడా సూచించింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన మంగళవారం అఖిలపక్షభేటీ జరిగింది. సమావేశానంతనం వివరలాను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మీడియాకు వెల్లడించారు. అయితే 'వీబీ జీ రామ్ జీ' చట్టంపై చర్చ జరగాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో రివర్స్ గేర్ వేసి.. గతంలోకి వెళ్లలేమని, అది అసాధ్యమని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఏదైనా ఒక్కసారి చట్టరూపం దాల్చాక దానిని పాటించాల్సిందేనన్నారు. ఈ నెల 28 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేంద్రం మంగళవారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించింది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ భేటీకి అధ్యక్షత వహించారు. ఆయా అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సమావేశం అనంతరం కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడారు. అయితే, బ్జడెట్ సమావేశాల నేపథ్యంలో.. సంబంధిత అంశాలపై చర్చలు జరపడమనేది నియమమని చెప్పారు. మోదీ ప్రభుత్వం ఎప్పుడూ నియమాలు, నిబంధనలను ఉల్లంఘించలేదన్నారు. రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటామని చెప్పారు. ఎంపీలంతా ప్రజాసమస్యలను లేవనెత్తేందుకే ఎన్నికయ్యారని, వారికి భావప్రకటనా స్వేచ్ఛ ఉంటుందని, కానీ.. ఇతర సభ్యులు చెప్పేది వినడం కూడా బాధ్యతేనని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగం అనంతరం సమావేశాల అజెండా పంచుకుంటామని చెప్పారు. సమావేశంలో తెలుగు రాష్ట్రాల నుంచి కెఆర్ సురేశ్ రెడ్డి, లావు కృష్ణదేవరాయలు, పిల్లి సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

# యాసిడ్ దాడుల కేసులో కీలక మలుపు

**నిందితుల ఆస్తులు వేలం వేసి, బాధితుకలు పరిహారం**

**సుప్రీం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ కీలక ఆదేశాలు**




**న్యూఢిల్లీ, జనవరి 27:** యాసిడ్ దాడుల కేసుల్లో బాధితులకు అండగా సుప్రీం కోర్టు నిలిచింది. వారికి అందచేస్తున్న పరిహారం సరిపోదని అభిప్రాయపడింది. నిందితుల ఆస్తులను వేలం వేసి బాధితులకు పరిహారంగా ఎందుకు ఇవ్వకూడదని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. జీవితాంతం చికిత్స, పునరావాసం కోసం ప్రస్తుతం బాధితులకు అందజేస్తున్న పరిహారం కనీసం రూ.3 లక్షలు సరిపోదని పేర్కొంది. ఈ విషయంలో మెరుగైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ దారుణమైన నేరాలను నివారించేందుకు అసాధారణమైన శిక్షలు అవసరమని, ఈ దిశగా చట్టంలో మార్పులు చేయాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సూచన చేశారు. యాసిడ్ దాడి బాధితురాలు షాహీన్ మాలిక్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం విచారించింది. బలవంతంగా యాసిడ్ తాగించిన ఘటనల్లో బాధితులకు తగిన పరిహారం, వైద్య సంరక్షణ సహా ఇతర ఉపశమనాలు లభించేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. తనపై జరిగిన యాసిడ్ దాడి కేసులో ఇప్పటికే 16 ఏళ్లు పోరాడానని, కానీ.. ట్రయల్ కోర్టులో నిందితులందరూ నిర్దోషులుగా విడుదలయ్యారని ఆమె ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో పోరాడుతూ తన జీవితంలో విలువైన కాలాన్ని కోల్పోయానని చెప్పారు. అయితే.. బాధితురాలి తరఫున హైకోర్టులో మంచి న్యాయవాది ఈ కేసును వాదించేలా సర్వోన్నత న్యాయస్థానం చర్యలు తీసుకుంటుందని సీజేఐ హామీ ఇచ్చారు. ఏడాది వారీగా యాసిడ్ దాడుల కేసులు, కోర్టుల్లో వాటి ప్రస్తుత స్థితి, బాధితుల కోసం చేపట్టిన పునరావాస కార్యక్రమాల వంటి వివరాలను అందజేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీం కోర్టు ఆదేశించింది. బాధితులతో బలవంతంగా యాసిడ్ తాగించిన కేసుల వివరాలను కూడా అందించాలని చెప్పింది. బాధితుల విద్యార్హత, ఉద్యోగం, వైవాహిక స్థితి, వైద్య చికిత్స, దానికి అయిన లేదా అయ్యే ఖర్చుల వివరాలను కూడా సమర్పించాలని తెలిపింది. నాలుగు వారాల్లోగా వివరాలను అందజేయాలని ఆదేశించింది.

# బడ్జెట్ పద్దులకు తుది మెరుగులు

**నార్త్ బ్లాక్‌లో హల్వా వేడుకలు**

**పాల్గొన్న ఆర్థికమంత్రి నిర్మలా సీతరామన్**

**న్యూఢిల్లీ, జనవరి 27:** ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్‌కు సంబంధించిన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా ఏటా నిర్వహించే హల్వా వేడుకను ఆర్థిక శాఖ కార్యాలయం నార్త్ బ్లాక్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ వేడుకలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌధరీ పాల్గొన్నారు. అలాగే ఆర్థిక శాఖ పరిధిలోని అన్ని విభాగాల కార్యదర్శులు, బ్జడెట్ రూపకల్పనలో భాగమైన అధికారులు కూడా హాజరయ్యారు. అనంతరం ఆమె బ్జడెట్ ప్రెస్‌ను పరిశీలించారు. ప్రింటింగ్, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. నిర్మలా సీతారామన్ బ్జడెట్ ప్రవేశపెట్టడం ఇది వరుసగా తొమ్మిదోసారి. ఒక వైపు అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, మరోవైపు మన దేశం 7.4శాతం వృద్ధి సాధిస్తున్న తరుణంలో ఈ బడ్జెట్ వెలువడనుంది. హల్వా వేడుకతో బ్జడెట్ లాక్-ఇన్ పీరియడ్ ప్రారంభం అవుతుంది. అంటే బ్జడెట్ తయారీలో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులు, సిబ్బంది పార్లమెంట్‌లో వార్షిక పద్దును ప్రవేశపెట్టేవరకు ఆ నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. వారు బయటకు వెళ్లడానికి వీలుండదు. వారు ఎల్లప్పుడూ సీసీటీవీ కెమెరాలు, భద్రతా సిబ్బంది నిఘాలో ఉంటారు. కనీసం వారు ఫోన్ చేయడానికి కూడా వీలుండదు. ఒకసారి పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ బ్జడెట్ ప్రసంగం పూర్తయిన తర్వాతే వీరు బయటకు వస్తారు. అంటే ఐదురోజులపాటు వీరికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఉండవన్నమాట. 1950లో బడ్జెట్ ముద్రణ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో లీక్ అవ్వడంతో ఈ లాక్-ఇన్ నిర్ణయం తీసుకున్నారు.



# కూలీ రేట్లు పెంచాలి కార్మికులకు భద్రత కల్పించాలి

- **గజ్వేల్‌లో భవన నిర్మాణ కార్మికుల భారీ బైక్ ర్యాలీ**




**నేటి సాక్షి - గజ్వేల్ :** చాలని కూలీలతో ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని భవన నిర్మాణ రంగంలో పనిచేస్తూ కుటుంబాలను పోషిస్తున్న తమ కష్టాలను ప్రభుత్వం గుర్తించాలని కోరుతూ సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో భవన నిర్మాణ కార్మికులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జోన్ సెంట్రింగ్ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ పట్టణ ప్రధాన రహదారుల గుండా సాగి ప్రభుత్వానికి తమ డిమాండ్లను వినిపించింది. ఈ సందర్భంగా సంఘ నాయకులు కప్ప చంద్రం, గుంటుకు రవి మాట్లాడుతూ భవన నిర్మాణ కూలీలు, మేస్త్రీలకు తగిన విధంగా కూలీ రేట్లు పెంచాలని, అలాగే పనివేళలో ప్రమాదాలకు గురవుతున్న కార్మికులకు ప్రాణ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి భవన నిర్మాణ కార్మికునికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు అమలు చేసి వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు. అదేవిధంగా కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వలస కార్మికుల కారణంగా స్థానిక తెలంగాణ భవన నిర్మాణ కూలీలకు ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేసి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ర్యాలీలో గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల సెంట్రింగ్ మేస్త్రీ సంఘాల నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తావుల భాస్కర్, నర్సింలు, శ్రీరామ్ రాజు, గూడూరు శీను, ప్రజ్ఞాపూర్ పరుశురాం, గడ్డం స్వామి, నర్సిమల్లేశం బాలేష్, గోవిందం కనకయ్య, సూరారం కనకయ్య, బాల్ దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.





**నేటి సాక్షి నారాయణపేట (ఇమామ్ సాబ్ ),:** నారాయణపేట మండలం లింగంపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ దేవత తల్లి జాతర మహోత్సవలు వైభవంగా వైభవంగా జరిగాయి. నారాయణపేట మాజీ డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇంచార్జి కుంభం శివకుమార్ రెడ్డి మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ఎల్లమ్మవ్వకి మొదటి పూజ నిర్వహించిన కుమ్మం శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు అదేవిధంగా, నియోజకవర్గ ప్రజలు, యువకులు, రైతులు అందరూ సంతోషంగా ఉండాలని ఎల్లమ్మ తల్లిని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, భక్తులు, గ్రామస్తులు మండల ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, జాతర మహోత్సవంలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాన్ని పొందారు

# గన్నేరువరంలో నేటి నుంచి సమ్మక్క సారలమ్మ జాతర

- **ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ చైర్మన్ బోయిని పోచయ్య**



**నేటి సాక్షి, గన్నేరువరం,( బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో నేటి నుండి శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర బుధవారం రోజున సాయంత్రం సారలమ్మ గద్దెకు వచ్చుట మరియు గోవింద రాజు పగిడిద్ద రాజులు గద్దెలకు వచ్చుట గురువారం రోజున సమ్మక్క గద్దెకు వచ్చుట శుక్రవారం రోజున మొక్కుబడులు సమర్పించు కొనుట అనంతరం శనివారం రోజున తిరిగి వన ప్రవేశం నిర్వహిస్తారు. ఈ నాలుగు రోజులపాటు జాతర అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు సమ్మక్క సారలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ బోయిని పోచయ్య తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మంచినీటి సౌకర్యం వైద్య సదుపాయం కరెంటు సదుపాయం ఏర్పాటు చేశారు. కరీంనగర్ నుండి ప్రతి గంటకు బస్సు సౌకర్యం అలాగే గుండ్లపల్లి నుండి బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బోయిని పోచయ్య కూన ఎల్లయ్య, బొడ్డు భూపతి, బుర్ర తిరుపతి గౌడ్, న్యాత సుధాకర్, దేశరాజ్ కనుకయ్య, బుర్ర మల్లయ్య గౌడ్, బోయిని మల్లయ్య, తేళ్ల బక్కయ్య, గూడూరు నవీన్, సమ్మయ్య, కయ్యం మహేష్, కొలుపుల మహేందర్, తదితరులు పాల్గొన్నారు. జాతరలో ఎలాంటి అవమాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై జి. నరేందర్ రెడ్డి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఎన్నికల కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్



- **నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు : ఎస్పీ వెల్లడి**

**నేటి సాక్షి - కొమరం భీం ఆసిఫాబాద్ :** రేపటి నుంచి ప్రారంభమయ్యే మున్సిపల్ ఎన్నికల నామినేషన్లను దృష్టిలో ఉంచుకుని ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు సమగ్రంగా ఉన్నాయని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, 100 మీటర్ల పరిధి నియమాలను కఠినంగా పాటించాలని, అనుమతి లేకుండా ఎవరినీ లోపలికి అనుమతించరాదని సూచించారు. అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట సీఐ బాలాజీ వరప్రసాద్, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# వైజ్ఞానిక ప్రదర్శనలో ద్వితీయ స్థానం సాధించిన ఉపాధ్యాయుడు

- **అభినందించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**

**జగిత్యాల - నేటి సాక్షి (ఇమ్మడి విజయ్ కుమార్):** సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 23 వరకు నిర్వహించిన దక్షిణ భారత స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మరి పెల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కడకుంట్ల అభయ్ రాజ్ తయారుచేసిన "సూపర్ సైన్స్ కిట్" ఉపాధ్యాయ బోధనోపకరణాల విభాగంలో ద్వితీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అభయ్ రాజును ఘనంగా అభినందించారు. విద్యార్థులకు సులభంగా విజ్ఞానం అందించేందుకు ఇలాంటి వినూత్న బోధనోపకరణాలు ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము, పీఆర్టీయూటీఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు బోయిన్ పెల్లి ఆనంద్ రావు, ప్రధాన కార్యదర్శి యాళ్ళ అమర్నాథ్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పొన్నం



రమేష్, రాయికల్ మండల శాఖ అధ్యక్షుడు అంతడుపుల గంగరాజం, ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య, జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రజెండా విజయమే లక్ష్యం..

**సీపీఐ అభ్యర్థులను గెలిపించాలి**

**జిల్లా కార్యదర్శి మంద పవన్ పిలుపు**



**నేటి సాక్షి గజ్వేల్:** సిద్ధిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేస్తూ ఎన్నో విజయాలు సాధించిన పార్టీ సీపీఐ అని అన్నారు. ప్రజల పక్షాన నిలిచే ఎర్రజెండా పోరాటాలే ఈ విజయాలకు నిదర్శనమని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సిద్ధిపేట జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో పోటీ చేస్తున్న సీపీఐ పార్టీ అభ్యర్థులను ప్రజలు ఓట్లేసి గెలిపించాలని ఆయన కోరారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఏడవ వార్డు నుంచి శివలింగ కృష్ణ సీపీఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, పట్టణ ప్రజలు పూర్తిస్థాయిలో మద్దతు ఇచ్చి గెలిపించాలని పిలుపునిచ్చారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు నుంచి కొండపోచమ్మ సాగర్‌కు వెళ్లే కాలువ ద్వారా రబీసీజన్‌లో రైతులకు సాగునీరు అందించి వ్యవసాయ రంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని మంద పవన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బట్టు దయానంద రెడ్డి, రాజేశం, రామచంద్రం తదితర పార్టీ నేతలు పాల్గొన్నారు.

# సౌండ్ సిస్టమ్ బహుకరణ



**నేటి సాక్షి-మేడిపల్లి :** గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 60,000 రూపాయల విలువైన మైక్ సెట్ బాక్సులను మన్నెగూడం వాసియైన తేలు నరేష్ స్పాన్సర్ చేశారు. ఈ బహూకరణ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం ప్రత్యేకంగా ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. స్థానిక భీమారం గ్రామ సర్పంచ్ చెక్కపెల్లి స్వాతి సంజీవ్, ఒడ్డాడు గ్రామ సర్పంచ్ బొమ్మన ప్రశాంత్, నాయకులు పల్లి అర్జున్, పల్లి సాయి, చిలివేరి వెంకటేష్, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు తేలు నరేష్‌ను అభినందించారు.

# పాలిటివ్ కేర్ ఆకస్మికంగా తనిఖీ.

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి స్వర్ణకుమారి.**



**నేటి సాక్షి వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి స్వర్ణకుమారి అనంతగిరిలోని పాలీటివ్ కేర్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ పాలీటివ్ కేర్ సెంటర్ ను 24 గంటలు పని చేసే విధంగా చూడాలని సిబ్బంది షిఫ్టుల ప్రకారం విధులు నిర్వహించాలని, ఇక్కడికి వచ్చే రోగులకు అవుట్ పేషెంట్ సేవలే కాక ఇన్ పేషంట్ సేవలను కూడా అందించాలని అవసరమైన వారిని అడ్మిషన్ చేసుకుని సేవలు అందించాలని ఆదేశించారు. పాలియేటివ్ కేర్ సెంటర్లో అందుబాటులో ఉన్న పడకలను క్రమ పద్ధతిలో అమర్చుకొని రోగులకు సౌకర్యవంతంగా ఉండేవిధంగా వైద్య సేవలు అందించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న వైద్యులు, స్టాఫ్ నర్స్ లు సిబ్బందికి 851 మందికి హెపటైటిస్ బి వాక్సినేషన్ చేయడం జరిగినదని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పాటు డిప్యూటీ డెమో వి శ్రీనివాసులు, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ సత్యం, ఇన్ సిడి కోఆర్డినేటర్ జయరాములు పాల్గొన్నారు

# దోమల మందు పిచికారి



**నేటి సాక్షి కోదాడ (అనంతగిరి):** మండల పరిధిలోని పాలవరం గ్రామంలో మంగళవారం సర్పంచ్ మట్టపల్లి నరేష్ ఆధ్వర్యంలో వీధుల వారీగా దోమల మందు పిచికారి చేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో ముమ్మర పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామని, పరిసరాలను మాతో పాటు, గ్రామ ప్రజల భాగస్వామ్యంతోనే పారిశుద్ధ్య వైపు అడుగులు వేస్తున్నామని, రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉండాలి అంటే ప్రజల యొక్క భాగస్వామ్యం ముఖ్యమని, ప్రజలందరూ సహకరించి పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. వర్షాకాలం రీత్యా పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉంది కాబట్టి, పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా దోమల బారి నుండి మనం రక్షించుకోవాలంటే మన ఇంటి చుట్టూ పరిసరాలను, పరిశుభ్రంగా చూసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బెల్లంకొండ అంజయ్య, వార్డు మెంబెర్స్ మట్టపల్లి లావణ్య, రామకృష్ణ, ఉపేందర్, అంజమ్మ, గ్రామ శాఖ అధ్యక్షుడు మట్టపల్లి రామకోటయ్య, సోషల్ మీడియా మట్టపల్లి నరేష్, శ్రీనివాస్ గౌడ్, ఉపేందర్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు, యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NO.11 SAKSHI
కరీంనగర్ | బుధవారం 28 జనవరి 2026

# పసుపు నువ్వుల పంటల పరిశీలన

**జిల్లా వ్యవసాయ అధికారి వి. భాస్కర్**



**నేటి సాక్షి, కొడిమ్యాల :** తిమ్మయ్యపల్లి గ్రామము లో జిల్లా వ్యవసాయ అధికారి వి. భాస్కర్.పసుపు, నువ్వులు. వరి. పంటలను పరిశీలించారు. రైతు నేస్తం కార్యక్రమం అనంతరం పసుపు కోత చేపడుతున్న రైతు డబ్బు లచిరెడ్డి ఫీల్డ్ ను సందర్శించి రైతు తో మాట్లాడి పసుపు పంట వివరాలు తెలుసుకోవడం జరిగింది.అలాగే ప్రత్తి పంట కొత అనంతరం నువ్వులు సాగు చేపట్టిన ఫీల్డ్ ను సందర్శించి, యాసంగి సాగు కి నువ్వుల పంట వేసుకోవాలని సూచించారు. అలాగే వరి పంటను సందర్శించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.జ్యోతి,మాజీ ఉపసర్పంచ డబ్బు ముత్యం రెడ్డి.రైతులు పాల్గొన్నారు.

# వాసరి రవి ఏకగ్రీవ ఎన్నిక



**నేటి సాక్షి - రాయికల్ ( ఇమ్మడి విజయ్ కుమార్ ) :** రాయికల్ మండల క్లబ్ కార్యదర్శిగా వాసరి రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాయికల్ పట్టణం లోని మండల క్లబ్ కల్యాణ మండపం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి క్లబ్ ఎన్నికలు జరిగాయి. ఇట్టి ఎన్నికల్లో సంయుక్త కార్యదర్శి గా చెరుకు మహేశ్వర శర్మ,కోశాధికారిగా చౌడారపు లక్ష్మినారాయణ, క్రీడా కార్యదర్శిగా బత్తిని భూమయ్య, సాంస్కృతిక కార్యదర్శిగా కొత్తపల్లి ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా బొంగోని భూమాగౌడ్, సింగని రమేష్,నీరటి శ్రీనివాస్, బాపురపు నర్సయ్య,కొత్తపల్లి గోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఇట్టి ఎన్నికల్లో కమిటీ కన్వీనర్, క్లబ్ ఫౌండర్ మోర హన్మాండ్లు, మాజీ కార్యదర్శి రుక్కుక్లబ్ సీనియర్ నాయకులు కాటిపెల్లి గంగారెడ్డి, గోపి రాజారెడ్డి, ఎద్దండి భూమారెడ్డి, కుంబాల శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల సదాశివా రెడ్డి, కుర్మ మల్లారెడ్డి, లక్ష్మినారాయణ,సాయిరెడ్డి, లింగారెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# 'అరైవ్ అలైవ' అవగాహన సదస్సు



**నేటి సాక్షి , గంగాధర:** గంగాధర మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 'అరైవ్ అలైవ' అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీటుబెల్టు వినియోగించాలని సూచించారు. వాహనాలను నడిపేటప్పుడు మొబైల్‌ఫోన్లు వాడకూడదని, ట్రాఫిక్ సిగ్నల్స్ క్రాస్ చేయకూడదన్నారు.

# ఒలింపియాడ్ తొలి బహుమతి

**నేటి సాక్షి - చిలుకూరు:** రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (SCERT) భారతి ఎయిర్‌టెల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "తెలంగాణ ఇంగ్లీష్ ఒలింపియాడ్" పోటీలో చేతవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి చిట్యాల నవదీప్ రాష్ట్రస్థాయిలో తొలిస్థానం సాధించి ప్రతిభను చాటుకున్నాడు. రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి సాధించి బేతవోలు మండలానికి గర్వకారణంగా నిలిచిన నవదీప్‌ను గ్రామ సర్పంచ్ వట్టికూటి నాగయ్య, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. విద్యార్థి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో ప్రతిభ చూపాలని వారు ఆకాంక్షించారు.

# కాంగ్రెస్‌తోనే నగర అభివృద్ధి సాధ్యం

**సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**




**నేటి సాక్షి కరీంనగర్:** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ముందుకు సాగుతున్నాయి. పట్టణంలోని 65వ డివిజన్ సౌరన్ స్ట్రీట్ వీరారెడ్డి హాస్పిటల్ సమీపంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 65వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ పోటీ అభ్యర్థి సయ్యద్ అహ్మద్ హుస్సేన్ నాయకత్వం వహించగా, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే నగరాభివృద్ధి వేగవంతం అవుతుందని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి, నగర ప్రగతికి సహకరించాలని ఆయన డివిజన్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రెటరీ రహమత్ హుస్సేన్, మైనార్టీ ప్రెసిడెంట్ మొహమ్మద్ తాజుద్దీన్, పార్టీ ఇతర ముఖ్య నాయకులు మరియు డివిజన్ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తామని ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు.

# వ్యవసాయ శాఖ వాట్సప్ ఛానల్ సభ్యత్వం పై అవగాహన సదస్సు



**నేటి సాక్షి, కొడిమ్యాల :** కొడిమ్యాల మండలంలో మంగళవారం. కొడిమ్యాల, పూడూర్, తిర్మలాపూర్ రైతు వేదిక లో రైతు నేస్తం కార్యక్రమం వీడియో కాన్ఫారెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో లో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి వి. భాస్కర్ గారు తిర్మలాపూర్ రైతు వేదిక లో పాల్గొన్నారు. దీనిలో పీజేటీఏయూ వ్యవసాయ వీడియోలు వ్యవసాయ శాఖ వాట్సాప్ ఛానల్ సభ్యత్వం,యూరియా అధిక వినియోగంపై రైతులకు అవగాహన వీడియో ప్రదర్శించడం, వేసవి కాలం లో చిరుధాన్యాల సాగు పద్ధతులు, తేనెటీగల పెంపకం మగద స్టార్టప్ (తేనె ఉత్పత్తి) గురించి, అలాగే పశువుల ఆహారం – పశుగ్రాస ఉత్పత్తి పెంచే మార్గాలు, ఫార్మర్ రిజిస్ట్రీ మరియు శాస్త్రవేత్తలతో పరస్పర చర్చ – రైతుల సూచనలు మరియు అభిప్రాయాలు రైతు నేస్తం కార్యక్రమం లో అవగాహన కల్పించడం జరిగింది.దీనిలో మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి,తిర్మలాపూర్ సర్పంచ్ తైదల అంజయ్య, శనివారపేట సర్పంచ్ గోలి ఐలయ్య, ఉపసర్పంచులు(తిర్మలాపూర్. శనివారంపేట్), AEO గ్రీష్మ, రాజేష్, తేజస్విని మరియు రైతులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**నేటి సాక్షి - రాయికల్ ( ఇమ్మడి విజయ్ కుమార్ ) :** ఆల్ ఇండియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షునిగా చెలిమెల మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా ఇమ్మడి విజయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దుగ్యాల రమాపతిరావు, కోశాధికారిగా గంట్యాల ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ షాకీర్, సామల్ల మహేష్, సంయుక్త కార్యదర్శిగా పడాల రమేష్, సాంస్కృతిక కార్యదర్శిగా బెక్కం సుధాకర్, గౌరవ అధ్యక్షునిగా మాలావత్ వెంకటేష్ మరియు కార్యవర్గ సభ్యులుగా మామిడి రాజు, బొమ్మ కంటి అనిల్, తిరుమల శంకర్ గంగుల శ్రీనివాస్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి సభ్యులందరూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు చింత కుంట సాయి కుమార్, యాచమనేని కిరణ్ బాబు, సయ్యద్ రసూల్ పాత్రికేయులు పాలేపు



# తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ రెడ్డి..అమర్‌కి సన్మానం




**నేటి సాక్షి - తొగుట । వడ్డే నరసింహులు:** తొగుట మండల సమాఖ్య సమావేశానికి ముఖ్య అతిథిగా తొగుట మండల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ విజయ్ రెడ్డి (అమర్) హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు.మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మహిళలకు తన వంతు పూర్తి సహకారం మండల స్థాయిలో ఉంటుందని తెలిపారు. గతంలో మాజీ మంత్రి వర్యులు శ్రీ చెరుకు ముత్యం రెడ్డి సహకారంతో తుక్కాపూర్ గ్రామ సంఘం రాష్ట్రంలోనే అత్యధికంగా మక్కల కొనుగోలు చేసి రికార్డు నెలకొల్పిందని, అప్పటి జిల్లా కలెక్టర్ స్మితా సబర్వాల్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం మహిళలు వడ్లు మాత్రమే కాకుండా మక్కల కొనుగోలు, మార్కెటింగ్ రంగాల్లో కూడా ముందుకు రావాలని, ప్రభుత్వం అన్ని అవకాశాలు కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 12 సెంటర్లతో పాటు, ఇతర గ్రామ సంఘాల మహిళలు ముందుకు వస్తే, కొత్త మార్కెట్ సెంటర్లు ఏర్పాటు చేసి అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. అలాగే మహిళల ఉపాధి అభివృద్ధి కోసం శ్రీ చెరుకు శ్రీనివాస రెడ్డి సహకారంతో టీ కప్ యూనిట్‌లు లేదా ఇతర చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు సహకారం అందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో అన్ని గ్రామాల VO అధ్యక్షురాళ్లు, సిబ్బంది, APM, జజలు, అకౌంటెంట్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ విజయ్ రెడ్డి (అమర్)కు శాలువాతో చిరు సన్మానం చేసి ఘనంగా సత్కరించారు.

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం..

- బీజేపీవి మత రాజకీయాలు
- మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ధ్వజం

**నేటి సాక్షి - గజ్వేల్ :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదు పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాళ్లతో ఉన్నప్పటికీ సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందించే విధంగా త్వరలోనే పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తామని తెలిపారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఐదో వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉడెం సారిక శ్రీనివాస్ రెడ్డితో కలిసి సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సమావేశంలో నర్సారెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్‌ను నమ్మి మూడుసార్లు అధికారం ఇచ్చిన ప్రజలను ఆయన పూర్తిగా మోసం చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా జీతం తీసుకుంటూ ఫామ్‌హౌస్‌కే పరిమితమై నియోజకవర్గ ప్రజల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ప్రజా సమస్యలను విస్మరించిన టీఆర్ఎస్ నేతలకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని, స్థానిక ప్రజలు తమ సమస్యలపై టీఆర్ఎస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. మరోవైపు బీజేపీ నేతలు అధికార ఆశతో మతాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గజ్వేల్ నియోజకవర్గంలో అన్ని మతాల ప్రజలు ఐక్యతతో జీవిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న పార్టీ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలు, మహిళలు, రైతులు, కార్మికుల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకొస్తున్నాయని తెలిపారు. రాబోయే గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి అభివృద్ధి, సంక్షేమ పాలనకు మద్దతు తెలపాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సారిక శ్రీనివాస్ రెడ్డి, షరీఫ్ ఉస్మాన్, కన్నా యాదవ్, ఉస్మాన్, బద్రి, నాగరాజు, జావిద్, యూసుఫ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# ఎన్నికల కోడ్ రావడంతో మంత్రి పర్యటన రద్దు

- దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి



**నేటి సాక్షి తొగుట.. వడ్డే నర్సింలు:** తొగుట మండలంలోని మల్లన్న సాగర్ నుండి దుబ్బాక కాలువలోకి నీళ్లు విడుదల కార్యక్రమాన్ని ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం వాళ్ళ అధికారులుకు ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జీ మంత్రి వర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి గారు నీళ్ళు విడుదల చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అన్నారు ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి మండల కేంద్రంలోని ఆర్ & బి గెస్ట్ హౌస్ వద్ద ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి రెండు రోజుల ముందే నీటిని విడుదల చేయాలని అధికారులు ఏర్పాట్లు చేసి మంత్రి షెడ్యూల్ ను ప్రకటించారు. కాని నిన్నటి రాత్రి ఏంఎల్‌ఏ మద్యం మత్తులో నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నీచ రాజకీయాలు చేయాలని చూస్తున్నారని అన్నారు.ప్రభుత్వమే ముందుగా రాబోయే వేసవి కాలన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని చెరువులు కుంటలకు నీటిని విడుదల చేయడానికి ఏర్పాట్లు చేశారు.ఎన్నికల కోడ్ నిబంధనల వల్ల అధికారులు నీటిని విడుదల చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), చేగుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంగళరావు ,మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, సర్పంచ్లు ఫోరం అధ్యక్షులు పిట్ల సత్తయ్య,ఉపసర్పంచ్ల ఫోరం అధ్యక్షులు అమరేందర్, సర్పంచ్లు, ఉపసర్పంచ్లు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచకప్ నుంచి తప్పుకుంటే పాక్‌కు చుక్కలే

**ఐసీసీ సీరియస్ వార్నింగ్.. దిగిరాక తప్పని పరిస్థితి**

## బహిష్కరిస్తే అంతర్జాతీయ నిషేధం తప్పదు

- పీసీబీ చీఫ్ మొహ్సిన్ నఖ్వీతో పాక్ ప్రధాని భేటీ
- శుక్రవారం లేదా సోమవారం తుది నిర్ణయం
- బంగ్లా స్థానంలో స్కాట్లాండ్ ఎంట్రీ

**లాహోర్, జనవరి 27:** టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ పాల్గొనడంపై సందిగ్ధత కొనసాగుతున్నా.. దాయాది దేశానికి మరో దారి లేదని స్పష్టమవుతోంది. బంగ్లాదేశ్ కు మద్దతుగా టోర్నీని లేదా భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బహిష్కరిస్తామని పాక్ ప్రగల్భాలు పలికినా.. ఆ సాహసం చేసే పరిస్థితి లేదని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ విషయంపై పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ సోమవారం పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో సమావేశమయ్యారు. బంగ్లాదేశ్ విషయంలో ఐసీసీ తీరును ప్రధానికి వివరించారు. అన్ని అవకాశాలను పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ప్రధాని ఆదేశించారు. దీంతో శుక్రవారం లేదా వచ్చే సోమవారం నాటికి పాక్ తమ తుది నిర్ణయాన్ని ప్రకటించనుంది. వాస్తవానికి ఫిబ్రవరి 15న భారత్‌తో జరిగే మ్యాచ్‌ను లేదా మొత్తం టోర్నీని బహిష్కరించాలని పాక్ భావించింది. కానీ ఇలా చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఐసీసీ హెచ్చరించినట్లు సమాచారం. ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే అంతర్జాతీయ టోర్నీల నుంచి సస్పెన్షన్, ఆసియా కప్‌లో పాల్గొనే హక్కును రద్దు చేయడం, పాక్ సూపర్ లీగ్ ఆటగాళ్లకు విదేశీ లీగ్‌ల ఎన్‌వోసీలు నిలిపివేయడం వంటి కఠిన చర్యలు తీసుకునే అవకాశముంది. దీంతో పాక్ వెనక్కి తగ్గే ఛాన్స్ ఉంది. ఒకవేళ పాక్ మొండిగా తప్పుకుంటే.. తిరిగి బంగ్లాదేశ్ ను పిలిచి శ్రీలంకలో మ్యాచ్ లు ఆడించే యోచనలో ఐసీసీ ఉంది.

### స్కాట్లాండ్ జట్టు ప్రకటన..

మరోవైపు ఈ మెగా టోర్నీ నుంచి బంగ్లాదేశ్ వైదొలగడంతో ఆ స్థానంలో స్కాట్లాండ్ ఆడనుంది. రిచీ బెరింగ్టన్ కెప్టెన్‌గా 15 మంది సభ్యుల జట్టును స్కాట్లాండ్ ప్రకటించింది. గ్రూప్-సిలో ఉన్న స్కాట్లాండ్ ఫిబ్రవరి 7న వెస్టిండీస్, 9న ఇటలీ, 14న ఇంగ్లాండ్, 17న నేపాల్‌తో తలపడనుంది. భారత్, శ్రీలంక వేదికగా ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ప్రపంచకప్ జరగనుంది.





# వైభవ్ విధ్వంసం

**24 బంతుల్లోనే హాఫ్ సెంచరీ**

**జింబాబ్వే బౌలర్లకు చుక్కలు**

## అండర్-19 వరల్డ్ కప్ లో రికార్డు

### భారత్ భారీ స్కోరు.. విహాన్, అభిజ్ఞాన్ జోరు

**బులవాయో, జనవరి 27 :** భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అండర్-19 ప్రపంచ కప్ 2026 సూపర్ సిక్స్ లో భాగంగా జింబాబ్వేతో జరుగుతున్న మ్యాచ్ లో వీరవిహారం చేశాడు. కేవలం 24 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసి సంచలనం సృష్టించాడు. వైభవ్ ధాటికి జింబాబ్వే బౌలర్లు బెంబేలెత్తిపోయారు.

### రికార్డుల మోత..

ఈ అద్భుతమైన ఇన్నింగ్స్‌లో వైభవ్ 4 సిక్సర్లు, 4 ఫోర్లు బాదాడు. అండర్-19 ప్రపంచ కప్ చరిత్రలో ఇది మూడవ వేగవంతమైన అర్ధ సెంచరీగా, ఈ టోర్నీలో ఉమ్మడి రెండో వేగవంతమైన హాఫ్ సెంచరీగా రికార్డుకెక్కింది. జపాన్ ఆటగాడు విల్ మలాజుక్ (23 బంతులు) మొదటి స్థానంలో ఉన్నాడు. బంగ్లాదేశ్‌పై 72 పరుగులు చేసిన తర్వాత ఈ టోర్నమెంట్‌లో వైభవ్ కు ఇది రెండో అర్ధ సెంచరీ. 41.50 సగటుతో 166 పరుగులు చేసి భారత్ తరపున టాప్ స్కోరర్ గా నిలిచాడు.

### ఒకే ఓవర్లో రెండు వికెట్లు..

బులవాయోలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన జింబాబ్వే బౌలింగ్ ఎంచుకుంది. జోరుమీదున్న వైభవ్ (30 బంతుల్లో 52), ఆయుష్ మాత్రే (19 బంతుల్లో 21) ఒకే ఓవర్లో పెవిలియన్ చేరారు. వీరిద్దరినీ అవుట్ చేసి జింబాబ్వే బౌలర్లు ఊపిరి పీల్చుకున్నారు.

### దంచికొట్టిన విహాన్, కుందు..

వైభవ్ అవుటైన తర్వాత విహాన్ మల్హోత్రా, అభిజ్ఞాన్ కుందు ఇన్నింగ్స్ ను నడిపించారు. విహాన్ 71 పరుగులతో అజేయంగా నిలవగా, అభిజ్ఞాన్ కుందు 61 పరుగులు చేశాడు. వేదాంత్ త్రివేది 15, ఆరోన్ జార్జ్ 23 పరుగులు చేశారు. దీంతో 40 ఓవర్లు ముగిసేసరికి భారత్ 6 వికెట్లు కోల్పోయి 262 పరుగులు చేసింది. ప్రస్తుతం విహాన్ తో పాటు అంబ్రిష్ (6) క్రీజులో ఉన్నారు.









# మూడు జట్లతోనే టీమిండియాకు ముప్పు!

## వరల్డ్ కప్ వేటలో అసలైన సవాల్

**సొంతగడ్డ సెంటిమెంట్ పై ఆందోళన.. ఆసీస్, ఇంగ్లండ్, సఫారీలతోనే ముప్పు**

## సూపర్-8లో ఎదురుకానున్న గట్టి పోటీ

**ముంబై, జనవరి 27:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026కు టీమిండియా సర్వసన్నద్ధమైంది. ప్రస్తుతం న్యూజిలాండ్ తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్ ను మరో రెండు మ్యాచ్ లు మిగిలి ఉండగానే కైవసం చేసుకుని జోరుమీదుంది. ముఖ్యంగా గౌహతి వేదికగా జరిగిన మూడో టీ20లో 154 పరుగుల లక్ష్యాన్ని కేవలం 10 ఓవర్లలోనే ఛేదించి ప్రత్యర్థులకు వణుకు పుట్టించింది. భారత విధ్వంసకర బ్యాటింగ్, పదునైన బౌలింగ్ చూసి మాజీ క్రికెటర్లు గవాస్కర్, సైమన్ డౌల్ సైతం టీమిండియాకు టీమిండియానే పోటీ అని వ్యాఖ్యానించారు. అయితే ఈ మెగా టోర్నీలో రోహిత్ సేనకు మూడు జట్ల నుంచి ముప్పు పొంచి ఉంది.

### సెంటిమెంట్ కలవరం..

టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఆతిథ్య జట్టు ఎప్పుడూ టైటిల్ గెలవలేదు. ఈ రికార్డు ఇప్పుడు భారత్ ను కలవరపెడుతోంది. లీగ్ దశలో నమీబియా, నెదర్లాండ్స్, అమెరికా,



పాకిస్థాన్ వంటి జట్లు ఉండటంతో టీమిండియా సూపర్-8కు సులభంగానే అర్హత సాధిస్తుంది. కానీ అసలైన పరీక్ష అక్కడే మొదలుకానుంది.

### ఆసీస్ తో జాగ్రత్త..

సూపర్-8లో టీమిండియాకు ఆస్ట్రేలియా నుంచి గట్టి పోటీ తప్పదు. ఐసీసీ టోర్నీల్లో ఆసీస్ ను తక్కువ అంచనా వేయలేం. ఆడమ్ జంపా వంటి నాణ్యమైన స్పిన్నర్, ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్ వంటి హిట్టర్లతో ఆ జట్టు బలంగా ఉంది. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ లో భారత్ ను ఓడించిన ఆత్మవిశ్వాసం వారికి ఉంది. ఐపీఎల్ అనుభవంతో భారత పిచ్ లపై వారికి మంచి పట్టుంది.

### ఇంగ్లండ్ దూకుడు..

పొట్టి ఫార్మాట్ లో భారత్ లాగే దూకుడుగా ఆడే జట్టు ఇంగ్లండ్. హ్యారీ బ్రూక్ కెప్టెన్సీలోని ఈ జట్టులో జోస్ బట్లర్, లియామ్ లివింగ్ స్టోన్ వంటి విధ్వంసకర వీరులు ఉన్నారు. ఎంతటి లక్ష్యాన్నైనా ఛేదించగల సత్తా వారికి ఉంది. స్పిన్నర్లతో పాటు భారత పిచ్ లపై అవగాహన ఉండటం వారికి కలిసొచ్చే అంశం.

### సఫారీలతో సవాల్..

గత టీ20 ప్రపంచకప్ రన్నరప్ సౌతాఫ్రికాతో కూడా భారత్ కు ముప్పు ఉంది. మార్క్రమ్ నాయకత్వంలోని సఫారీ జట్టులో డికాక్, మిల్లర్, స్టబ్స్, బ్రెవిస్ వంటి హిట్టర్లు, జాన్సెన్, బాష్ వంటి ఆల్ రౌండర్లు ఉన్నారు. రబడా, నోర్జ్, ఎంగిడి వంటి పేసర్లు, కేశవ్ మహారాజ్ వంటి స్పిన్నర్లతో బౌలింగ్ విభాగం పటిష్టంగా ఉంది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ఈ మూడు జట్లు టీమిండియా కలలను భగ్నం చేసే ప్రమాదం ఉంది.

# గుజరాత్ జయకేతనం

## ఢిల్లీ క్యాపిటల్స్ పై 3 పరుగుల తేడాతో గెలుపు



- కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన బెత్ మూనీ
- బౌలింగ్ లో మెరిసిన సోఫీ డివైన్, రాజేశ్వరి
- వృథాగా పోయిన నికీ ప్రసాద్ పోరాటం

**వడోదర, జనవరి 27:** ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) లో మంగళవారం అత్యంత ఆసక్తికర పోరు జరిగింది. చివరి బంతి వరకు నువ్వా-నేనా అన్నట్లు సాగిన మ్యాచ్ లో గుజరాత్ జెయింట్స్ జట్టు విజయం సాధించింది. వడోదర అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన ఈ మ్యాచ్ లో గుజరాత్ 3 పరుగుల స్వల్ప తేడాతో గెలుపొంది ఊపిరి పీల్చుకుంది.

### మూనీ అర్ధ శతకం..

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ కు దిగిన గుజరాత్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. కెప్టెన్ బెత్ మూనీ (46 బంతుల్లో 58) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడి జట్టుకు గట్టి పునాది వేసింది. అనుష్క బ్రిజ్ మోహన్ శర్మ (25 బంతుల్లో 39) దూకుడుగా ఆడగా, చివర్లో తనుజా కన్వర్ (11 బంతుల్లో 21) మెరుపులు మెరిపించడంతో గుజరాత్ భారీ స్కోరు సాధించగలిగింది. ఢిల్లీ బౌలర్లలో నల్లపురెడ్డి చరణి 4 వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేసే ప్రయత్నం చేసింది. చినిల్లే హెన్రీ 2 వికెట్లు, మిన్ను మణి ఒక వికెట్ తీశారు.

### బోల్తా కొట్టించిన సోఫీ..

175 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ చివరి వరకు పోరాడినా విజయం దక్కలేదు. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 171 పరుగులు మాత్రమే చేసి, విజయానికి 3 పరుగుల దూరంలో నిలిచిపోయింది. నికీ ప్రసాద్ (24 బంతుల్లో 47) సిక్సర్లతో విరుచుకుపడినా జట్టును గెలిపించలేకపోయింది. స్నేహ్ రాణా (15 బంతుల్లో 29), లారా వోల్వార్డ్ (23 బంతుల్లో 24) రాణించినా కీలక సమయాల్లో వికెట్లు కోల్పోవడం ఢిల్లీకి శాపంగా మారింది. గుజరాత్ బౌలర్ సోఫీ డివైన్ 4 వికెట్లు తీసి ఢిల్లీ నడ్డి విరిచింది. రాజేశ్వరి గైక్వాడ్ 3 వికెట్లు, ఆష్లే గార్డనర్ ఒక వికెట్ తీసి విజయంలో కీలక పాత్ర పోషించారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737
కరీంనగర్
బుధవారం
28 జనవరి 2026

# క్యాస్టింగ్ కౌచ్ ముమ్మాటికీ నిజం

## చిరంజీవి వ్యాఖ్యలతో విభేదించిన సింగర్ చిన్మయి

**ఇండస్ట్రీలో 'కమిట్‌మెంట్'కు అర్థం వేరు - అవకాశం కావాలంటే లొంగిపోవాల్సిందే - ఎక్స్ వేదికగా సుదీర్ఘ పోస్టు**





**హైదరాబాద్, జనవరి 28:** చిత్ర పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ లేదంటూ మెగాస్టార్ చిరంజీవి చేసిన వ్యాఖ్యలతో ప్రముఖ గాయని చిన్మయి శ్రీపాద విభేదించారు. ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ ముమ్మాటికీ ఉందని, అది లేకుండా సినీ పరిశ్రమ లేదని సోషల్ మీడియా వేదికగా ఖరాఖండిగా చెప్పారు. సినిమాలో అవకాశం కావాలంటే లొంగిపోవాల్సిందేనని, ఇది చేదు నిజమని పేర్కొంటూ 'ఎక్స్' (ట్విట్టర్) లో సుదీర్ఘ పోస్టు పెట్టారు.

### అర్థం మార్చేశారు..

సినీ పరిశ్రమలో నిబద్ధత (కమిట్‌మెంట్) అనే పదానికి పూర్తి భిన్నమైన అర్థం ఉందని చిన్మయి ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణంగా కమిట్‌మెంట్ అంటే వృత్తిపరమైన నిబద్ధత అని అర్థమని, కానీ ఇండస్ట్రీలో మాత్రం కొందరు పురుషులు ఈ పదాన్ని అడ్డం పెట్టుకుని మహిళల నుంచి లైంగిక వాంఛలు తీర్చుకోవాలని చూస్తారని మండిపడ్డారు. కమిట్‌మెంట్ ఇవ్వకపోతే కొత్తవారికి అవకాశాలు రావడం లేదని స్పష్టం చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు నేటికీ వేదికలపై స్పీచ్ లు ఇస్తూనే ఉన్నారని పరోక్షంగా చురకలు అంటించారు.

### చేదు అనుభవాలు..

గతంలో ఓ ప్రముఖ సింగర్ ఇక్కడి చేదు అనుభవాలకు భయపడి ఇండస్ట్రీనే వదిలి వెళ్లిపోయారని గుర్తుచేశారు. తాను కూడా లైంగిక వేధింపులు ఎదుర్కొన్నానని, తన తల్లి సమక్షంలోనే ఎంతో నమ్మిన ఒక పెద్దమనిషి తనతో తప్పుగా ప్రవర్తించాడని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఆయన లెజెండ్.. కానీ..

చిరంజీవి ఒక లెజెండ్ అని, ఆయన తరంలో నటీనటులు పరస్పరం గౌరవించుకునేవారని చిన్మయి అభిప్రాయపడ్డారు. ఇటీవల 'మన శంకరవరప్రసాద్' సక్సెస్ మీట్ లో చిరంజీవి మాట్లాడుతూ.. 'మనం నిక్కచ్చిగా ఉంటే ఎవరూ అవకాశం తీసుకోరని, క్యాస్టింగ్ కౌచ్ ఉండద'ని చేసిన వ్యాఖ్యలను ఆమె తప్పుబట్టారు. కేవలం మన ప్రవర్తన బాగుంటే సరిపోదని, ఇక్కడ పరిస్థితులు వేరని తేల్చిచెప్పారు.




# 'జననాయగన్'కు మళ్లీ కష్టాలు

## సింగిల్ బెంచ్ తీర్పును కొట్టేసిన హైకోర్టు

## మరోసారి విచారణ జరపాలని ఆదేశం

- సెన్సార్ బోర్డు వాదనలు వినాల్సిందే
- విడుదల మరింత ఆలస్యమయ్యే ఛాన్స్

**చెన్నై, జనవరి 28:** విజయ్ కథానాయకుడిగా హెచ్ వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన 'జన నాయగన్' చిత్రానికి మరోసారి చుక్కెదురైంది. ఈ సినిమాకు 'యు/ఏ' సర్టిఫికెట్ ఇవ్వాలంటూ గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును మద్రాసు హైకోర్టు మంగళవారం పక్కనపెట్టింది. ఈ వ్యవహారంపై మరోసారి విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని తిరిగి సింగిల్ బెంచ్ ను ఆదేశించింది.

సెన్సార్ బోర్డుకు తమ వాదనలు వినిపించేందుకు తగిన న్యాయపరమైన అవకాశాలు కల్పించాలని మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్ సూచించింది. సినిమాను రివైజింగ్ కమిటీకి పంపిన నిర్ణయం సరైనదా, కాదా అనే అంశాన్ని సింగిల్ జడ్జి స్వేచ్ఛగా పరిశీలించి నిర్ణయం తీసుకోవచ్చని పేర్కొంది. కేసుకు సంబంధించిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆదేశాలు జారీ చేసే అధికారం సింగిల్ బెంచ్ కు ఉందని స్పష్టం చేసింది. జనవరి 9న సినిమాకు 'యు/ఏ' సర్టిఫికెట్ ఇవ్వాలని సింగిల్ బెంచ్ ఆదేశించగా, దాన్ని సవాల్ చేస్తూ సీబీఎఫ్‌సీ డివిజన్ బెంచ్ ను ఆశ్రయించింది. విచారణ చేపట్టిన న్యాయస్థానం సర్టిఫికెట్ జారీపై తాత్కాలిక స్టే విధించింది. దీన్ని సవాల్ చేస్తూ నిర్మాణ సంస్థ సుప్రీంకోర్టుకు వెళ్లగా, జోక్యానికి నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం తిరిగి మద్రాసు హైకోర్టుకే వెళ్లాలని సూచించింది. జనవరి 21న సుదీర్ఘ వాదనల అనంతరం డివిజన్ బెంచ్ తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా వెలువరించిన తీర్పుతో సినిమా విడుదల మరింత ఆలస్యం అయ్యే


# ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు పండగ వార్త

## మే నెలలో 'దేవర-2' షూటింగ్ షురూ

## క్లారిటీ ఇచ్చిన నిర్మాత సుధాకర్

## వచ్చే ఏడాది విడుదల చేసేలా ప్లాన్

## మొదటి భాగం కంటే పవర్‌ఫుల్‌గా సీక్వెల్




**హైదరాబాద్, జనవరి 28:** జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు నిర్మాత సుధాకర్ అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు. కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన బ్లాక్ బస్టర్ హిట్ 'దేవర'కు సీక్వెల్ పనులు ఈ ఏడాది మే నెలలో ప్రారంభం కానున్నట్లు ప్రకటించారు. 2024లో విడుదలైన మొదటి భాగం మంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే.

### పుకార్లకు చెక్..

సీక్వెల్ ఉంటుందని గతంలోనే ప్రకటించినప్పటికీ, ఆ తర్వాత ఎటువంటి సమాచారం లేకపోవడంతో సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వచ్చాయి. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న నిర్మాత సుధాకర్ దీనిపై స్పష్టత ఇచ్చారు. మేలో షూటింగ్ మొదలుపెట్టి, వచ్చే ఏడాదిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. దీంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### పార్ట్-1లో చూసింది 10 శాతమే..

మొదటి భాగం కంటే రెండో భాగం చాలా పవర్ ఫుల్ గా ఉంటుందని దర్శకుడు కొరటాల శివ గతంలోనే వెల్లడించారు. పార్ట్-1లో చూసింది కేవలం 10 శాతం మాత్రమేనని, రెండో భాగంలో 100 శాతం యాక్షన్, ఎమోషన్ చూస్తారని అంచనాలు పెంచారు. ప్రతి పాత్రలో ఊహించని ట్విస్టులు ఉంటాయని చిత్ర బృందం చెబుతోంది. ప్రపంచం ఎప్పటికీ గుర్తుపెట్టుకునేలా ఈ సినిమా ఉంటుందని గతంలో నిర్మాణ సంస్థ పేర్కొంది.






# 'ఉస్తాద్' డబ్బింగ్ షురూ

## మార్చి 26న రిలీజ్ కు ప్లాన్?.. చెర్రీ స్థానంలో బాబాయ్ ఎంట్రీ

హైదరాబాద్, జనవరి 28: పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబినేషన్ లో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' డబ్బింగ్ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని ధృవీకరిస్తూ చిత్ర బృందం సోషల్ మీడియాలో ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. గబ్బర్ సింగ్ తర్వాత దేవిశ్రీ ప్రసాద్ సంగీతంతో ఈ కాంబినేషన్ రిపీట్ అవుతుండటంతో భారీ అంచనాలు ఉన్నాయి.ఈ సినిమాను మార్చి 26న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వాస్తవానికి ఆ తేదీన రామ్ చరణ్ సినిమా 'పెద్ది' రావాల్సి ఉండగా.. అది వాయిదా పడటంతో ఆ స్లాట్ ను 'ఉస్తాద్' భర్తీ చేయనున్నాడని టాక్. శ్రీలీల, రాశి ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. 'ఈసారి పర్ఫార్మెన్స్ బద్దలైపోద్ది' అంటూ పవన్ చెప్పే డైలాగులు హైలైట్ కానున్నాయి.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# లింగంపల్లిలో కల్లు దుకాణాల్లో బాల కార్మికులు

● జాతర పేరుతో అధిక ధరలు

**నేటి సాక్షి - నారాయణపేట(ఇమామ్‌సాబ్):** నారాయణపేట జిల్లా లింగంపల్లి గ్రామంలో ఎల్లమ్మ జాతర మహోత్సవాల సందర్భంగా కల్లు దుకాణాల్లో చిన్నపిల్లలతో పనిచేయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కల్లు తాగి పడేసిన సీసాలను బాల కార్మికులతో తీస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జాతర సందర్భంగా కల్లు సీసా ధరను ఒక్కో సీసాకు రూ.30గా నిర్ణయించడంతో జాతరకు వచ్చిన కల్లు ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ రోజులతో పోలిస్తే ధరలు పెరిగాయని మహిళలు, జాతరకు వచ్చిన ప్రజలు చర్చించుకుంటున్నారు.

## బెల్ట్ షాపుల్లో అదనపు వసూళ్లు

లింగంపల్లి గ్రామంలో అక్రమ మద్యం బెల్ట్ షాపులు జోరుగా వెలిశాయని సమాచారం. మద్యం సీసాపై రూ.40 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు.

## పట్టించుకోని అధికారులు?



జాతర సందర్భంగా కల్లు, మద్యం ధరల పెంపు, బాల కార్మికుల వినియోగంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మద్యం విక్రయాలు, బాల కార్మిక వ్యవస్థపై సంబంధిత శాఖలు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

# కాంగ్రెస్‌లో కలహాల కాపురం

● మెట్‌పల్లి మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ పోరు - ఆశావాహుల హడావుడి



**నేటి సాక్షి - కోరుట్ల (రాధారపు నర్సయ్య):** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మెట్‌పల్లి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజల మద్దతు పెరుగుతుందన్న అంచనాలతో ప్రతి వార్డు నుంచి ఆశావాహుల సంఖ్య గణనీయంగా పెరిగింది. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులు అధికంగా ఉండటంతో పార్టీ అధిష్ఠానం దరఖాస్తుల స్వీకరణ పేరిట కాలయాపన చేస్తోంది. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో నాయకుల్లో టికెట్ ఉత్కంఠ ఒక్కసారిగా పెరిగింది. నోటిఫికేషన్‌కు ముందే ప్రచారం మొదలుపెట్టిన ఆశావాహులు పట్టణమంతా ఫ్లెక్సీలు, ప్రచారాలతో హడావుడి చేస్తున్నారు. దాదాపు పది వార్డుల్లో కాంగ్రెస్ నుంచి ఆశావాహుల సంఖ్య అధికంగా ఉండటంతో బీ-ఫామ్‌ల కేటాయింపులో కోరుట్ల ఇంచార్జి జువ్వాడి నర్సింగరావుకు తలనొప్పి తప్పదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## నాయకుల మధ్య విభేదాలు

కోరుట్ల నియోజకవర్గంలో జువ్వాడి నర్సింగరావు, కొమిరెడ్డి కరం, టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజీత్ రావు ప్రధాన నాయకులుగా ఉన్నారు. జువ్వాడి, కొమిరెడ్డి అవగాహనతో కలిసి పనిచేస్తున్నప్పటికీ, సుజీత్ రావు ప్రత్యేక వర్గాన్ని నడుపుతున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్నికల్లో రాష్ట్ర అధిష్ఠానం వద్ద తన పంతం నెగ్గించుకున్న సుజీత్ రావు, సర్పంచ్ ఎన్నికల్లో కూడా తన వర్గానికి చెందిన అభ్యర్థులను గెలిపించుకున్నారని సమాచారం. ఇటీవల మెట్‌పల్లి పట్టణంలో మకాం వేయడంతో పట్టణ రాజకీయాల్లో కూడా గ్రిప్ పెంచుకున్నట్టు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లో సుజీత్ వర్గం అభ్యర్థులు రంగంలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.వార్డుల వారీగా కాంగ్రెస్‌లో పోటీ

## 9వ నుండి 25వ వార్డు వరకు టికెట్ ఆశావాహులు

9వ వార్డు (రామ్‌నగర్) న్యాయవాది రజాక్, ఖుతబుద్దీన్ పాషా, చాంద్ పాషా టికెట్ ఆశిస్తున్నారు. గత ఎన్నికల్లో ఎంఐఎం నుంచి పోటీ చేసి రెండో స్థానం సాధించిన చాంద్, ఈసారి కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్నాడు.

## 11వ వార్డు (వెంకట్రావుపేట)

న్యాయవాది, మాజీ సర్పంచ్ కొమిరెడ్డి లింగారెడ్డి, కొమిరెడ్డి తిరుపతి రెడ్డి, బత్తుల ప్రసాద్, కొమిరెడ్డి శేషాద్రి పోటీలో ఉన్నారు. తిరుపతి రెడ్డి భార్య గతంలో ఎంపీటీసీగా పనిచేసింది. బత్తుల ప్రసాద్, ఆయన సతీమణి గతంలో సర్పంచ్‌లుగా పనిచేశారు.

## 12వ వార్డు (బ్రూక్లిన్ స్కూల్ - అర్బన్ కాలనీ)

సీనియర్ నాయకుడు యండి షాకీర్‌ను పక్కనబెట్టి, జువ్వాడి-కొమిరెడ్డి వర్గం కొత్త ముఖంగా ముఖీమ్‌ను ముందుకు తెచ్చింది. 15వ వార్డు (పద్మశాలిలు అధికంగా ఉన్న ప్రాంతం). తాజా మాజీ పిప్పెర లలిత రాజేష్‌కు పోటీగా ద్యావనపల్లి రాజారామ్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు.

## 21వ వార్డు (దుబ్బవాడ)

అజీమ్ ప్రచారం మొదలుపెట్టగా, 22వ వార్డు ఎస్టీకి రిజర్వ్ కావడంతో చైర్‌పర్సన్ అభ్యర్థి జెట్టి లింగం 21వ వార్డుకు వలస వచ్చారు. ఇద్దరూ పక్కపక్కనే ఫ్లెక్సీలు పెట్టుకోవడం రాజకీయ చర్చనీయాంశమైంది.

## 25వ వార్డులో టికెట్ వార్ రామ్ ప్రసాద్ జం సహదేవ్

మెట్‌పల్లి మున్సిపల్ రాజకీయాల్లో 25వ వార్డు హాట్‌స్పాట్‌గా మారింది. తుమ్మనపల్లి రామ్ ప్రసాద్ గత 16 ఏళ్లుగా కాంగ్రెస్‌లో పనిచేస్తున్న హార్డ్‌కోర్ కార్యకర్త. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలుకు కూడా వెళ్లిన నేపథ్యం ఆయనకు ఉంది. జువ్వాడి నర్సింగరావుకు నమ్మినబంటుగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నాడు. ఇదే వార్డులో మద్రి సహదేవ్ ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి కీలక నేతగా ఎదిగారు. వార్డు బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో రెండు వర్గాల మధ్య టికెట్ పోరు మొదలైంది. పాత నేత రామ్ ప్రసాద్ కుటుంబానికా? కొత్త నేత సహదేవ్ కుటుంబానికా? అనే ప్రశ్న జువ్వాడి నర్సింగరావుకు రాజకీయంగా తలనొప్పిగా మారింది.

## బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌కు వలసలు

మెట్‌పల్లి మున్సిపల్‌లో రెండు సార్లు గెలిచిన బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పార్టీ మారడం రాజకీయంగా సంచలనంగా మారింది. 25 ఏళ్లుగా ఎమ్మెల్యే వర్గంలో కీలకంగా ఉన్న నేతలు కాంగ్రెస్‌లో చేరడం ఎమ్మెల్యే వర్గంలో కలకలం రేపింది.

## 'ఆ నలుగురు' నేతల భవితవ్యం?

## (మూడో తోవ వెతుక్కోక తప్పదా?)

టికెట్ దక్కని ఆశావాహులు మూడో పార్టీ వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అధిష్ఠానం సర్వే ఆధారంగా బీ-ఫామ్ ఇస్తామని ప్రకటించడంతో టికెట్ కోసం ఎదురుచూస్తున్న నేతల్లో అసహనం పెరుగుతోంది. మొత్తానికి మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో ఎవరు ఏ పార్టీ నుంచి నామినేషన్ వేస్తారో, ఎవరికీ బీ-ఫామ్ వస్తుందో, ఎవరు బరిలో నిలిచి విజయం సాధిస్తారో అన్నది ఆసక్తికరంగా మారింది.

# డ్రగ్స్, ఆన్‌లైన్ మోసాలపై అవగాహనే ఆయుధం

● సామాజిక సేవకుడు మంతెన సంజీవ్

● యువతను కాపాడే దిశగా అవగాహన కార్యక్రమం

**నేటి సాక్షి, ఎండపల్లి:** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం, ఆన్‌లైన్ మోసాలపై యువత, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇదే గ్రామానికి చెందిన సామాజిక సేవకులు మంతెన సంజీవ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమం చైతన్యాన్ని నింపింది. ఈ సందర్భంగా సంజీవ్ తో పాటు దీనికి అతిథులుగా హాజరైన నాయకులు మాట్లాడుతూ... మత్తు పదార్థాలకు అలవాటు పడితే యువత భవిష్యత్తు అంధకారమవుతుందని అన్నారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తి ఆరోగ్యానికే కాదు, కుటుంబాలు, సమాజాన్ని కూడా దెబ్బతీస్తుందని హెచ్చరించారు. యువత చదువు, ఉద్యోగం, క్రీడలు వంటి సానుకూల మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించారు.



అలాగే రోజురోజుకూ పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. బెట్టింగ్, ఫోన్ కాల్స్, లాటరీలు, నకిలీ లింకులు, బ్యాంకు వివరాలు అడిగే సందేశాల పట్ల జాగ్రత్త వహించాలని తెలిపారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఇతరులకు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు, ఆన్‌లైన్ మోసాల రకాలు, వాటి నుంచి ఎలా రక్షించుకోవాలో గ్రామస్తులకు వివరించారు. ఇందుకు సంబంధించిన అవగాహన వీడియోలు తెరపై ప్రదర్శించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. చివరగా మత్తును మరిచి మానవత్వం చాటాలని మోసాలకు బలి కాకుండా అప్రమత్తంగా ఉండాలంటూ గ్రామస్తులకు పిలుపునిచ్చారు. సమాజానికి కుదిపేస్తున్న డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం, రోజు రోజు పెరుగుతున్న ఆన్లైన్ మోసాల నుండి ప్రజలను రక్షించేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు.

# తహసిల్దార్‌కు ఘన సన్మానం

## ఉత్తమ తహసిల్దార్ అవార్డు అందుకున్న సందర్భంగా అభినందనలు

## ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలి

## సర్పంచ్ సాయగౌడ్ జగన్



**నేటి సాక్షి - మెట్‌పల్లి(దామ రాజేష్):** గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ తహసిల్దార్ అవార్డు అందుకున్న మెట్‌పల్లి తహసిల్దార్‌ను జగ్గసాగర్ గ్రామ సర్పంచ్ పుల్ల సాయగౌడ్ జగన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ పాలనలో ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

## ఉత్తమ తహసిల్దార్‌గా గుర్తింపు

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలు అందించినందుకు మెట్‌పల్లి తహసిల్దార్‌కు జిల్లా కలెక్టర్ ఉత్తమ తహసిల్దార్ అవార్డును ప్రదానం చేశారు. ఈ అవార్డు పొందిన సందర్భంగా జగ్గసాగర్ గ్రామ సర్పంచ్ పుల్ల సాయగౌడ్ జగన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

## ప్రజాసేవలో మరింత ముందుకు

ఈ సందర్భంగా సర్పంచ్ సాయగౌడ్ జగన్ మాట్లాడుతూ, తహసిల్దార్ ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరిస్తూ మెట్‌పల్లి మండలానికి మంచి పేరు తీసుకువచ్చారని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని కోరారు. ఈ సన్మాన కార్యక్రమంలో కొముల రాజు, పాల్ రెడ్డి, దేవనపల్లి సాగర్, చేపూరి రఘు తదితరులు పాల్గొని తహసిల్దార్‌ను అభినందించారు. కార్యక్రమం సాదాసీదాగా, ఆత్మీయ వాతావరణంలో ముగిసింది.

# చేర్మెన్ పదవి ఎవరిని వారిస్తుందో

## జనరల్ రావడం తో అయోమయంలో ఆశ వహులు

**నేటి సాక్షి మంచిర్యాల:** క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్మెన్ జనరల్ మహిళ కావడం తో ఇటు కాంగ్రెస్ పార్టీ తో పాటు ప్రతిపక్ష బిఆర్ఎస్ లోను ఆశ వాహుల సంఖ్యా పెరుగుతుంది.క్యాథనపల్లి మున్సిపల్ ఛైర్మన్ సీట్ పై కన్నేసిన బిఆర్ ఎస్ నాయకుడు ప్రభుత్వ ఉద్యోగం లో ఉన్న తన భార్య ను ఉద్యోగానికి రాజీనామా చేయించి, రిజర్వేషన్ ప్రకారం ఎస్సి మహిళ వచ్చిన వార్డులో నుండి బరిలో నిలిపే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో గత పది సంవత్సరాలుగా ఆ వార్డులో బిఆర్ఎస్ పార్టీ ని పట్టుకొని పని చేస్తున్న నాయకులూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ,మొదటి నుండి పని చేసిన మమ్ముల్ని కాదని టికెట్ వేరే వ్యక్తులకు ఇచ్చేది లేదంటూ చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే సుమన్ ను కలిసి వేడుకున్నట్లు తెలుస్తుంది.

# కేంద్రాల వద్ద బందోబస్తు

## మున్సిపల్ ఎన్నికల ప్రక్రియకు పూర్తి స్థాయి భద్రతా ఏర్పాట్లు

## ఎన్నికల ప్రవర్తన నియమావళి కచ్చితంగా పాటించాలి

## జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో(రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు.

## నామినేషన్ ప్రక్రియకు భద్రతా ఏర్పాట్లు

జగిత్యాల, రాయికల్, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీలకు సంబంధించి రేపటి నుండి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో పోలీసు శాఖ సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా ఎస్పీ తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధి నిబంధన అమలులో ఉంటుందని, అక్కడ సెక్షన్ 144 కూడా అమలులో ఉంటుందని పేర్కొన్నారు. నామినేషన్ ప్రక్రియకు అనుగుణంగా శాంతిభద్రతలకు భంగం కలగకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన వెల్లడించారు.

## నిబంధనలు పాటించాల్సిందే

నామినేషన్ల దాఖలు సందర్భంగా అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)ను కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ స్పష్టం చేశారు. కుల, మత, ప్రాంత, వర్గ విభేదాలను రెచ్చగొట్టే విధంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయరాదని హెచ్చరించారు. నామినేషన్ కేంద్రాల వద్ద వాహనాల వినియోగం, ఊరేగింపుల నిర్వహణ ఎన్నికల నిబంధనలకు లోబడి ఉండాలని, లౌడ్ స్పీకర్ల వినియోగానికి సంబంధిత అధికారుల అనుమతి తప్పనిసరి అని తెలిపారు.

## పరిమితులతో ప్రవేశం

నామినేషన్ సమర్పణకు ఊరేగింపుతో వచ్చే అభ్యర్థి అనుచరులు, మద్దతుదారులు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల పరిధి వరకు మాత్రమే అనుమతించబడతారని జిల్లా ఎస్పీ తెలిపారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థితో పాటు మరో ఇద్దరికి మాత్రమే ప్రవేశం ఉంటుందని, నామినేషన్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్
బుధవారం
28 జనవరి 2026

## నూతన కమిటీ ఎన్నిక

**గన్నేరువరం మున్నూరు కాపు సంఘం గ్రామ అధ్యక్షునిగా మహేష్**



**నేటి సాక్షి, గన్నేరువరం,( బుర్ర అంజయ్య గౌడ్ ):** గన్నేరువరం, మున్నూరు కాపు సంఘం మండలం అధ్యక్షులు బొడ్డు సునీల్ విలేకరుల సమావేశం నిర్వహించి గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన బొడ్డు మహేష్ ను మున్నూరు కాపు యువజన సంఘం గ్రామ శాఖ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం బొడ్డు మహేష్ మాట్లాడుతూ నా నియమకానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతల తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మంగరపు సాయికుమార్, ఉపాధ్యక్షులు కొట్టే సాగర్, దోగ్గలి రాజు, కోశాధికారి బొమ్మ శ్రీను, కార్యదర్శి పుల్లెల వెంకటేష్, సహాయ కార్యదర్శులు కయ్యం శ్రీకాంత్, శ్రీమన్ సాయి, మున్నూరు కాపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక

**గన్నేరువరం మున్నూరు కాపు సంఘం గ్రామ శాఖ అధ్యక్షునిగా బొడ్డు మహేష్**



**నేటి సాక్షి, గన్నేరువరం(బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన బొడ్డు మహేష్ ను మున్నూరు కాపు యువజన సంఘం గ్రామ శాఖ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్ మాట్లాడుతూ, సంఘాన్ని మరింత బలోపేతం చేసే విధంగా యువత ముందుకు రావాలని సూచించారు. నూతన అధ్యక్షుడు బొడ్డు మహేష్ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి, యువత ఐక్యతకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మంగరపు సాయికుమార్, ఉపాధ్యక్షులు కొట్టే సాగర్, దోగ్గలి రాజు, కోశాధికారి బొమ్మ శ్రీను, కార్యదర్శి పుల్లెల వెంకటేష్, సహాయ కార్యదర్శులు కయ్యం శ్రీకాంత్, శ్రీమన్ సాయి, మున్నూరు కాపు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని శవం లభ్యం



**పరిశీలించిన మరికల్ ఎస్సై....**

**నేటి సాక్షి నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని పెద్ద చింతకుంట గ్రామంలోని చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం నాడు చోటుచేసుకుంది. ఈ వ్యక్తి వయస్సు 45 సంవత్సరాలలోపు ఉంటాడని గ్రామస్తులు వివరించారు. ఈ సంఘటన పై పెద్ద చింతకుంట గ్రామస్తులు మరికల్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి మరికల్ ఎస్సై రాములు పరిశీలించడం జరిగింది.

## ఆమినిగుంటలో పశువైద్య శిబిరం



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** మండలంలోని పంచాయతీ కేంద్రం ఆమిని గుంటలో మంగళవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు .పశువైద్య శిబిరానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది .చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన 130 పశువులకు భూటాక్ స్ప్రే చేసినట్లు పశువైద్యాధికారి పవన్ కుమార్ తెలిపారు. అదే విధంగా 75 గోడలకు నటన నిర్మూలన ముందు తాపించామన్నారు. గర్భకోశ వ్యాధులు చూడి నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది గోవర్ధన్ మహమ్మద్ అలీ రెడ్డి ప్రసాద్ హరీష్ పాడి రైతులు పాల్గొన్నారు

# జగిత్యాల జిల్లాలో 5 మున్సిపాలిటీలకు ఎన్నికలు

- **అధికారులు సిద్ధంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**నేటి సాక్షి - జగిత్యాల(పూరెళ్ల బాపు):** ంండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి పాల్గొన్నారు.

**రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ:**

రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్లు అన్ని ఏర్పాట్లు చేయాలని, ఎస్పీలు పటిష్టమైన పోలీస్ బందోబస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో జరిగే ఎన్నికలు కావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలు స్వేచ్ఛా, న్యాయ, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు మాట్లాడుతూ:**

రెండవ సాధారణ గ్రామ పంచాయితీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు. అదే విధంగా మున్సిపల్ ఎన్నికలు కూడా స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ:**

పట్టణ కేంద్రాల్లో జరిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని 24/7 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, అవసరమైతే అటవీ, ఎక్సైజ్ శాఖల సిబ్బందిని కూడా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీలకు ఆదేశించారు.

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ:**

జగిత్యాల జిల్లాలో 5 మున్సిపాలిటీలకు రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు, స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని సూచించారు. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను మరోసారి వెరిఫై చేయాలని ఆదేశించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే జిల్లా యంత్రాంగం మొత్తం ఎన్నికల కమిషన్ పరిధిలోకి వస్తుందని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని తెలిపారు. 24, 48, 72 గంటల నివేదికలను సమయానికి పంపాలని అధికారులను ఆదేశించారు.

**ఎన్నికల నిర్వహణలో**

మాన్‌పవర్ మేనేజ్‌మెంట్, శిక్షణ, బ్యాలట్ బాక్సులు, రవాణా, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఖర్చుల పర్యవేక్షణ, మీడియా నిర్వహణ, హెల్ప్‌లైన్, ఫిర్యాదుల పరిష్కారం, నివేదికలు, మైక్రో ఆబ్జర్వర్లు వంటి కీలక అంశాలకు జిల్లా స్థాయిలో బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. నోడల్ అధికారులు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకున్న వలతాటి ప్రభాకర్..

**నేటి సాక్షి నంద్యాల**:77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం నంద్యాల జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినెట్ గా విధులు నిర్వహిస్తున్న వలతాటి. ప్రభాకర్ గారికి ఉత్తమ ఉద్యోగిగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ, మరియు జాయింట్ కలెక్టర్ కొల్ల.బత్తుల.కార్తీక్, జిల్లా ఎస్పీ, సునీల్ షేరన్ చేతులమీదుగా ఉత్తమ ఉద్యోగిగా అవార్డు పురస్కారం అందుకున్నారు. వీధి నిర్వహణలో సేవలందించిన వలతాటి. ప్రభాకర్ నాకు ఈ అవార్డు పురస్కారం వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది,అని తెలిపారు.ఉత్తమ పురస్కారం పై తోటి ఉద్యోగులు, ప్రజలు, బంధువులు స్నేహితులు, శ్రేయోభిలాషులు పలువురు హర్షం వ్యక్తం చేశారు.



# ఛాతిలో నొప్పితో ఆసుపత్రిలో వృద్ధుడి మృతి

- **కోరుట్లలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌పై నిర్లక్ష్య ఆరోపణలు**

**నేటి సాక్షి - కోరుట్ల(రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ఓ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో 70 ఏళ్ల వృద్ధుడు మృతి చెందడం తీవ్ర కలకలం రేపుతోంది. సరైన సమయంలో వైద్యం అందకపోవడంతోనే వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడని బంధువులు ఆరోపిస్తున్నారు. గణతంత్ర దినోత్సవం రోజున వైద్యులు అందుబాటులో లేకపోవడం, పేషెంట్‌ను రాత్రంతా పర్యవేక్షించకపోవడం వంటి అంశాలు వివాదాస్పదంగా మారాయి. కథలాపూర్ మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన గాండ్ల లింగం (70) సోమవారం ఛాతిలో నొప్పితో తీవ్ర అస్వస్థతకు గురై గ్రామంలోని ఆర్‌ఎంపీ వైద్యుడు విజయ్‌ను సంప్రదించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం ఎలాంటి సమగ్ర పరీక్షలు చేయకుండానే కోరుట్ల పట్టణంలోని ఓ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే గణతంత్ర దినోత్సవం కారణంగా ఆసుపత్రిలో నిపుణ వైద్యులు అందుబాటులో లేకపోయినప్పటికీ వృద్ధుడిని అడ్మిట్ చేసి వెళ్లిపోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ రాత్రి పేషెంట్‌ను సరైన విధంగా పర్యవేక్షించలేదని, తెల్లవారుజామున బాత్‌రూమ్‌కు వెళ్లిన సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందినట్లు సమాచారం.

**వైద్య నిర్లక్ష్యమే కారణమా..?**

వృద్ధుడికి సకాలంలో వైద్యం అందకపోవడంతోనే మృతి చెందాడని బంధువులు ఆరోపిస్తున్నారు. ఛాతిలో నొప్పి నిజంగా హార్ట్ అటాక్‌కు దారితీసిందా..? లేక వైద్య నిర్లక్ష్యమే కారణమా..? అన్నది స్పష్టత లేని పరిస్థితి. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

**మృతి విషయం దాచిపెట్టే యత్నం..?**

వృద్ధుడు మృతి చెందిన విషయాన్ని బయటకు రాకుండా మృతదేహాన్ని నేరుగా స్వగ్రామానికి తరలించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విషయం రాద్ధాంతం కాకముందే గ్రామ పెద్దలతో మాట్లాడి వ్యవహారాన్ని సర్దుబాటు చేసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఈ ఘటనపై వివరణ కోరేందుకు ప్రయత్నించినప్పటికీ ఆసుపత్రి వైద్యులు, యాజమాన్యం అందుబాటులో లేనట్లు 'నేటి సాక్షి' గుర్తించింది.

**ఆర్‌ఎంపీలు - ఆసుపత్రుల మధ్య కమీషన్ ఆరోపణలు**

కోరుట్ల పట్టణంలోని కొన్ని ఆసుపత్రులు గ్రామాల్లోని ఆర్‌ఎంపీలతో కమీషన్ ఒప్పందాలు చేసుకుంటున్నాయన్న ఆరోపణలు బహిర్గతమవుతున్నాయి. ప్రతి బిల్లులో 60 శాతం వరకు ఆర్‌ఎంపీలకు చెల్లిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గ్రామాల్లో రోగులను మొదట ఆర్‌ఎంపీలు ట్రీట్ చేసి పరిస్థితి చేజారినప్పుడు పెద్ద ఆసుపత్రులకు తరలిస్తున్నారని, అక్కడ భారీ బిల్లులు వేసి రోగులను దోపిడీ చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.



**నామమాత్రపు వైద్యం - ప్రాణాల నష్టం**

సీనియర్ వైద్యులు మొదటిసారి మాత్రమే చూసి, తర్వాత కింది స్థాయి సిబ్బందికి బాధ్యతలు అప్పగించడం వల్ల నిర్లక్ష్యం జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగా అనేక మంది రోగులు ప్రాణాలు కోల్పోతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కోరుతున్నారు. వైద్య నిర్లక్ష్యానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- **ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి సూచనలు**

**నేటి సాక్షి - జగదేవపూర్:** మంగళవారం జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామంలో నర్సరీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, ఈ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ అధికారులను కోరారు. అధికారులకు సూచిస్తూ, పూర్తయిన ఇండ్లను త్వరలోనే లబ్ధిదారులకు అందజేయడానికి చర్యలు తీసుకోవాలని, నిర్మాణం ఆలస్యమైతే వెంటనే ప్రారంభించేలా చూడమని ఆయన ఆదేశించారు. నర్సరీలో మొక్కల పెంపకం వేగవంతం చేయాలని, విత్తనాలు నాటిన తర్వాత వాటిని క్రమంగా సంరక్షించమని చెప్పారు. అలాగే, ప్రతి రోజు నీటిపారుదల జరగాలని, వీధుల్లో నిర్లక్ష్యం వహించకూడదని హెచ్చరించారు. హాస్పిటల్, గ్రామపంచాయతీ ఆవరణల్లో పిచ్చి గడ్డిని తొలగించి పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని, తిగుల్ గ్రామాన్ని స్వచ్ఛంగా మార్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రజిత ఎంపీడీవోకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, హౌసింగ్ శాఖ ఏఈ విశాఖ ఇన్చార్జి ఎపిఓ సుధాకర్, కార్యదర్శి నరేందర్, ఎఫ్ఏ పార్వతి, పిఎస్ఎస్ మాజీ డైరెక్టర్ భూమయ్య, మాజీ సర్పంచ్ బిక్షపతి, నాయకులు కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కవితమ్మను ఓడించేంత శక్తి నాకు ఉందా.?



- అలాగని బలహీనుణ్ణి మాత్రం కాదు.!
- రాజకీయాల్లోకి వచ్చింది సేవ కోసమే.. వ్యక్తిగత లాభాల కోసం కాదు
- మున్సిపల్ అవినీతిని ముందే హెచ్చరించా.. ప్రోత్సహించను
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**నేటి సాక్షి - జగిత్యాల( రాధారపు నర్సయ్య):** జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా రాజకీయాల్లోకి వచ్చానని, సొంత ప్రయోజనాల కోసం కాదని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. కవితమ్మను ఓడించేందుకు ప్రయత్నించానన్న ఆరోపణలను ఖండించిన ఆయన, కేసీఆర్ కుమార్తెను ఓడించేంత శక్తి తనకు ఉందా..? అని ప్రశ్నించారు. అలాగని తాను బలహీనుడిని కూడా కాదని వ్యాఖ్యానించారు.

## ప్రజాసేవ కోసమే రాజకీయాలు

జగిత్యాల పట్టణంలోని మోతే కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను సొంత లాభం కోసం చేస్తున్నామని విమర్శించడం సరికాదన్నారు. ప్రజలకు విస్తృతంగా సేవ చేయాలన్న లక్ష్యంతోనే రాజకీయాల్లోకి వచ్చానని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని స్పష్టం చేశారు. ఎల్ఎల్ గార్డెన్ నుంచి రాజేశం గుట్ట వరకు రోడ్డు నిర్మాణం విషయంలో సీనియర్ నాయకులు బాధ్యతాయుతంగా మాట్లాడాలని సూచించారు.

## జగిత్యాల మున్సిపల్ అవినీతిపై హెచ్చరిక

జగిత్యాల మున్సిపల్‌లో జరుగుతున్న అవినీతి తన దృష్టికి వచ్చిన వెంటనే అధికారులను అప్రమత్తం చేశానని ఎమ్మెల్యే తెలిపారు. తీరు మార్చుకోకపోతే జైలుకు వెళ్లాల్సి వస్తుందని కూడా హెచ్చరించానన్నారు. అయినా మున్సిపల్‌లో జరిగిన అవినీతి విషయంలో తనపై నిందలు మోపడం అన్యాయమని వ్యాఖ్యానించారు. 2020 వరకు జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులే మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్నారని గుర్తు చేస్తూ, 2014 ఎన్నికల్లో తాను ఓడిపోయిన తర్వాత అప్పటి సీఎం కేసీఆర్‌ను కలిసి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మంజూరు కోసం ఎందుకు ప్రయత్నించలేదని ప్రశ్నించారు.

## కవితమ్మ ప్రోత్సాహం.. అభివృద్ధిపై దృష్టి

కవితమ్మ ప్రోత్సాహంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వెల్లడించారు. 2018లో ఆమె సహకారంతో కేసీఆర్‌ను ఒప్పించి నూకపల్లి (నూకపల్లి)లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు ప్రారంభించానన్నారు. కాంట్రాక్టర్ పనులు వదిలేసి వెళ్లడంతో గౌరీ శంకర్ అనే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాల్సి వచ్చిందని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తున్నానని, కేంద్ర నిధుల కోసం ఎంపీతో మాట్లాడి నిధులు మంజూరు చేయించానని తెలిపారు. రాజకీయ విమర్శలు సహజమేనని, కానీ అవి సూచనల మాదిరిగా ఉండాలన్నారు.

# కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న పాలక ప్రభుత్వాలు

- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్




**నేటి సాక్షి పాములపాడు:** మండల కేంద్రంలో ఉన్న నెమలి వెంకట్ రెడ్డి భవన్ సిపిఎం కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ సమావేశం టి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించడం జరిగింది ముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి- టి.రమేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తూ పేద మధ్యతరగతి ప్రజానీకానికి తీరని అన్యాయం చేస్తుందని బిజెపి సిద్ధాంతాలను ప్రోత్సాహంచేస్తూ రాజ్యాంగ సవరణ చేయాలంటూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయాలని విద్యుత్ కూడా ప్రైవేట్ రంగానికి అప్పజెప్పేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్రాలపై పన్నుల బరాలు మోపుతూ పెత్తనం చెలాయిస్తుందని ఆరోపించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చి, వికసిత్ భారత్ జిరాంజీ పార్లమెంట్లో చట్టం చేసి కేంద్ర ప్రభుత్వం నిధుల వాటాను 90 శాతం ఉన్న వాటను 60% కుదించి రాష్ట్రాల వాటా 10 శాతం ఉంటే, 40 శాతానికి పెంచి నిర్వీర్యం చేశారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద రైతులకు ఇతర వృత్తిదారులకు వ్యవసాయ కూలీలకు ఈ చట్టం వరం లాంటిదని ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుందని అలాంటి చట్టాన్ని పేరు మార్పు చేసి ఏం సాధిస్తారని ఆయన ప్రశ్నించారు. మహిళలకు సమాన పని సమాన వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తుల ఒత్తిడికి తలొగ్గి కొత్త చట్టాలు అమలు పేరుతో విత్తన చట్టాన్ని విదేశీ కంపెనీల చేతులలో పెడుతూ ఈ దేశ రైతాంగానికి తీవ్రమైన అన్యాయం చేస్తుందన్నారు. లేబర్ కోడ్ పేరుతో 29 రకాల కార్మిక హక్కుల చట్టాలను నాశనం చేస్తు కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. దేశంలో పరిస్థితులను చూస్తుంటే ప్రశ్నించే వారిని అణచివేసే చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య కళాశాలలను కార్పొరేట్ శక్తులకు ధారాధత్వం చేయడం లాంటి చర్యలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒడిగట్టడం దుర్మార్గమన్నారు. దేశంలో రెండే ఐడియాలజీలు ఉన్నాయని ఒకటి పెట్టుబడి విధానం కాగా మరొకటి సోషలిజం అని తెలిపారు. పెట్టుబడిదారీ వ్యవస్థను కార్మికులు పేదల పక్షాన ప్రశ్నించే సత్తా కమ్యూనిస్టు పార్టీకి మాత్రమే ఉందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రైతుల్ని, కార్మికులను, కర్షకులను ఉపాది కూలీలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నాగేశ్వరావు, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి డి.స్వామన్న, ఏం.రాజు, ఎస్.బాలయ్య, బాల యేసు, బి.రమణమ్మ, అంజలి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడేషన్ పేరుతో జర్నలిస్టుల స్వేచ్ఛపై సంకెళ్లు



- ఉద్యోగాలు లేక జర్నలిజమే జీవనాధారం అయితే తప్పేనా?
- డిగ్రీలు-పీజీలు చదివి జర్నలిస్టు అయితే నేరమా?
- పొలిటికల్ సైన్స్ చదువు లేకుండా సీఎం, ఎమ్మెల్యేలు కావచ్చూ జర్నలిస్టు కావడం ఎందుకు తప్పు?
- ప్రెస్ స్వేచ్ఛపై దాడిగా ఐ & పీఆర్ ఉత్తర్వులు - భూక్యా రవి నాయక్ ఆగ్రహం

**నేటి సాక్షి మహబూబాబాద్ ।భూక్యా రవినాయక్ :** సమాచార పౌర సంబంధాల శాఖ (ఐ & పీఆర్) జారీ చేసిన తాజా ఉత్తర్వులు జర్నలిస్టుల స్వేచ్ఛను తీవ్రంగా కట్టడి చేసే విధంగా ఉన్నాయని నేటి సాక్షి రిపోర్టర్ భూక్యా రవి నాయక్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అక్రిడేషన్ కార్డు ఉన్నవారికే వాహనాలపై 'ప్రెస్' అని రాసుకునే హక్కు ఉందని, అక్రిడేషన్ లేని వారు అలా రాసుకుంటే మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ప్రకటించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధమని ఆయన మండిపడ్డారు.

ఈ ఉత్తర్వులు కేవలం చట్ట అమలు చర్యలు కావని, జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేసి ప్రశ్నించే స్వరాన్ని మౌనం చేయాలనే ప్రయత్నంగా భావించాల్సి ఉంటుందని అన్నారు. అక్రిడేషన్ కార్డు ఉంటేనే జర్నలిస్టా? అక్రిడేషన్ ఉన్న ప్రతివ్యక్తి నిజంగా జర్నలిస్టేనా? అక్రిడేషన్ లేకుండా ప్రజాసమస్యలపై నిజాయితీగా వార్తలు రాస్తున్న వారు జర్నలిస్టులు కారా? అనే మౌలిక ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో వేలాదిమంది జర్నలిస్టులు ఉద్యోగాలు లేని పరిస్థితుల్లో జీవనాధారం కోసం జర్నలిజాన్ని వృత్తిగా ఎంచుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు. డిగ్రీలు, పీజీలు చదివినా ఉద్యోగాలు రాక నిరుద్యోగులుగా మారిన యువత జర్నలిజాన్ని ఆశ్రయిస్తే దానిని తప్పుగా ఎందుకు చూస్తున్నారని ప్రశ్నించారు. కాలయాపన చేయకుండా, సమాజ సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టుగా పనిచేయడం నేరమా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇక్కడ ఒక తీవ్రమైన ద్వంద్వ వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని భూక్యా రవి నాయక్ విమర్శించారు. పొలిటికల్ సైన్స్ చదవని వారు ముఖ్యమంత్రులు కావచ్చు, ఎమ్మెల్యేలు కావచ్చు, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించవచ్చని, కానీ జర్నలిజం చదవని లేదా అక్రిడేషన్ లేని వారు జర్నలిస్టులుగా పనిచేస్తే మాత్రం తప్పుగా ఎందుకు భావిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులకు విద్యార్హతలు అవసరం లేదని రాజ్యాంగం చెబుతుంటే, జర్నలిస్టులకు మాత్రం ప్రభుత్వ కార్డు తప్పనిసరి అన్న భావన ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. 'ప్రెస్' అనేది ప్రభుత్వ ముద్ర కాదని, అది జర్నలిస్టు వృత్తి గుర్తింపని ఆయన స్పష్టం చేశారు. అక్రిడేషన్ అనేది ప్రభుత్వ సౌకర్యార్థం జారీ చేసే పరిపాలనా పత్రం మాత్రమే తప్ప, జర్నలిస్టు హోదాకు ప్రమాణం కాదన్నారు. అలాంటి అక్రిడేషన్‌ను ఆధారంగా చేసుకుని 'ప్రెస్' అనే పదాన్ని వాడే హక్కును పరిమితం చేయడం ప్రమాదకరమైన దిశగా తీసుకెళ్తుందని హెచ్చరించారు. వాహనాలపై 'ప్రెస్' అనే పదాన్ని నిషేధించడం ద్వారా జర్నలిస్టులను రోడ్లపై అనుమానితులుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని, ఇది జర్నలిస్టులపై మానసిక ఒత్తిడిని పెంచే చర్యగా పేర్కొన్నారు. జర్నలిస్టులు అక్రిడేషన్ ఉన్నా లేకపోయినా మాట్లాడే హక్కు, రాసే హక్కు రాజ్యాంగం ఇచ్చిన హక్కులేనని గుర్తు చేశారు. అక్రిడేషన్ దుర్వినియోగం జరుగుతుంటే దానిపై విచారణ చేయవచ్చని, కానీ జర్నలిస్టులందరినీ ఒకే గూటికి కట్టి అనుమానించడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. అక్రిడేషన్ ఆధారంగా 'ప్రెస్' హక్కును కట్టడి చేసే ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, ఈ నిర్ణయాన్ని భూక్యా రవి నాయక్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

# ఎన్నికల నామినేషన్లకు సిద్ధం

## కలెక్టర్ హేమావతి



**నేటి సాక్షి గజ్వేల్:** గజ్వేల్ పట్టణంలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియకు సంబంధించి గజ్వేల్ ఐఓసీలో చేసిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హేమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులతో నామినేషన్ ప్రక్రియపై చర్చించారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 20 వార్డులకు సంబంధించిన నామినేషన్లు ఐఓసీలో స్వీకరించనున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు, రాజకీయ పార్టీ ప్రతినిధులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాఫీగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అలాగే మొత్తం మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నామినేషన్ స్వీకరణ సమయంలో భద్రతా ఏర్పాట్లు, మౌలిక వసతులు సమర్థంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఆర్ అండ్ ఆర్ ముంపు గ్రామాలతో కలిపి 20 వార్డులను అధికారులు ఏర్పాటు చేయగా 71 పోలింగ్ స్టేషన్లలో పురుషులు 22 738, స్త్రీలు 2401, ఒకరు ఇతరులు ఒకరు ఉండగా 46వేల740 ఓటర్లు ఉన్నారు. పోలింగ్ స్టేషన్లో వద్ద ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హైమావతి మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్‌కు ఆదేశించారు.

# గృహజ్యోతి అమలు చేయాలి

## ఎంపీడీవో రమణ రావుకు వినతి పత్రం సమర్పించిన యువ నాయకుడు కృష్ణరెడ్డి



**నేటి సాక్షి - జోగులాంబ గద్వాల (కేటీ దొడ్డి):** గృహజ్యోతి పథకం అమల్లోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ అర్హులైన పేద కుటుంబాలకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో లబ్ధి అందడం లేదని యువ నాయకుడు గాజుల కృష్ణరెడ్డి మండల ఎంపీడీవో రమణ రావుకు వినతి పత్రం సమర్పించారు. మండలంలోని అనేక గ్రామాల్లో తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్నప్పటికీ వందలాది పేద కుటుంబాలు ఇప్పటికీ సాధారణ కరెంటు బిల్లులు చెల్లించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డేటా ఎంట్రీలో తప్పులు, దరఖాస్తుల పెండింగ్ వంటి కారణాలు చెప్పడం సమంజసం కాదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం గృహజ్యోతి పథకం అమలు చేస్తామని ప్రకటిస్తుండగా, మరోవైపు విద్యుత్ అధికారులు బిల్లులు చెల్లించకపోతే కనెక్షన్లు తొలగిస్తామని హెచ్చరిస్తున్నారని ఆయన విమర్శించారు. ఉచిత కరెంటు అమలు కాకుండా బిల్లులు రావడం పేద కుటుంబాలకు తీవ్ర భారంగా మారిందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహజ్యోతి పథకం లబ్ధి త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు.

# ఇసుక ట్రాక్టర్ కింద పడి కోడి మృతి

## బాధితుడు కోడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్ళి న్యాయం కోరాడు



**నేటి సాక్షి - మహబూబాబాద్ (బి. రవి నాయక్):** మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం మూల మర్రి తండాలో అక్రమ ఇసుక రవాణా మరోసారి ప్రమాదకరమని నిరూపించింది. ఒక ఇసుక ట్రాక్టర్ వేగంగా, నిర్లక్ష్యంగా నడిపించబడిన సందర్భంలో ఒక కోడి కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో బాధితుడు తీవ్ర ఆవేదనకు లోనై, కోడిని ప్రత్యక్ష సాక్ష్యంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్ళి తనకు న్యాయం చేయాలని కోరాడు. "ఇది కోడి మరణం మాత్రమే కాదౌ రేపు ఎవరి పిల్లలు, ఎవరి కుటుంబ సభ్యులపై ఈ ట్రాక్టర్లు పడతాయో తెలియదు. నాకు న్యాయం కావాలి" అని ఆయన పోలీసుల ఎదుట వేడుకున్నారు. గ్రామస్తుల వివరాల ప్రకారం, మూల మర్రి తండా పరిసరాల్లో అనుమతులు లేకుండా ఇసుక ట్రాక్టర్లు గ్రామంలో నిర్భయంగా తిరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఇసుక మాఫియాను అడ్డుకునే నాథుడే లేరా?, మైనింగ్, రెవెన్యూ, పోలీసులు ఎక్కడకి చూస్తున్నారు? వంటి ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. బాధితుడు మాట్లాడుతూ, అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, ట్రాక్టర్ యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో అక్రమ ఇసుక రవాణా రోడ్డు ప్రమాదాల ముప్పును పెంచుతూ, పశువులు, పక్షులు, ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు పేర్కొన్నట్లు, ఈ చిన్న ఘటన కూడా గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ ఇసుక వ్యాపారం ఎంత దారుణంగా సాగుతోందో స్పష్టంగా చూపే ఉదాహరణగా నిలుస్తోంది. అధికారులు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.